సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక

సంచిక-1
సంపుటి-2

జనవరి 1978

విడి ప్రతి 60 పై.
సాలు చందా రూ 7

గుణపాఠంగా ఉండవలసిన అనుభవం

జీవితానికి అవసరమైన వస్తువుల విలువలు ఆకాశానికి ఎగబాకుతుంటే, మానవత్వపు విలువలు దూసుకుపోతున్నాయి పాతాళంలోకి.

అలమరల తలుపులు తోసుకొని బయటికి ఉరికి వస్తున్నాయి అస్థిపంజరాలు, బతికివున్న రోజుల్లో పడిన పాట్లు చెప్పుకోడానికి.

సర్వత్రా వ్యాపించి మురిగిపోతున్న అవినీతి, దుర్గాహపు దురాశ, కరడు కట్టిన స్వార్థం — వీటన్నిటి ఫలితమైన క్షుద్ర సంస్కారాలన్నీ, వాటి వాటి కుతంత్రాలతోనూ, కుహకాలతోనూ, ఎన్నెన్ని ఘోరాలు చేసినా సురక్షితంగానే వున్నాయి, కపాలాల సోపానాల మీంచి యింకా ఎగబాకుతూనే వున్నాయి పైపైకి

దివిసీమ నరకసీమ అయినా, దేశమంతా వల్లకాడుగా మారినా కబుర్లతో కాలక్షేపం జరిగే పరిస్థితి, మొసలి కన్నీళ్ళవంటి సానుభూతి తప్ప, దేశంలో వీర విహారం చేస్తోన్న అరిష్టాలకు మూలకారణాలను అన్వేషించగల చిత్తశుద్ధి కనిపించదు; కనీసం యికమీదటయినా యిటువంటి ఘోర ఉపద్రవాలకు బలికాకుండా కట్టుదిట్టాలు చేసేందుకు ముందు చూపు కనిపించదు.

ఇంతకు ముందర 1734లో, 1864లో యిటువంటి ఘోర నష్టం జరిగిందని జ్ఞాపకం తెచ్చుకుంటున్నాం. తుఫానుల్ని ఆపడం సాధ్యం కాదని శాస్త్రవేత్తలనుండి తెలుసుకుంటున్నాం. అయితే గతానుభవాన్నిబట్టి, తుఫాను బీభత్సానికి బలికాకుండా

సాధ్యమైనంత తక్కువ నష్టంతో బయటపడడానికి గట్టి ప్రయత్నాలు చెయ్యవచ్చును. కాని, పెద్దపెద్ద కబుర్లు వినిపించినంతగా, గట్టి ప్రయత్నాలు జరుగుతాయనుకోవడం సందేహమే.

ఎందుచేతనంటే వేనవేలమంది నష్టం, కోటానుకోట్లుగా ధన నష్టం అనేక సార్లు జరిగింది.

స్పరిపాలనను

కారణంగ ాని దురదృష్ట

వశాత్తూ, ముప్పయ్యేళ్ళనుంచి మనకా సదుపాయం లేకుండా పోయింది, ఆత్మ వంచన చేసుకోడానికి

ఇటువంటి ఘోర నష్టాల అనుభవం కొత్తదేమీ కాదు: తారీఖులతోనూ, వివరాలతోనూ పత్రికలు లోగడ జరిగిన విపత్తుల గురించి సమాచారాన్ని తవ్వితీసి ప్రచురించాయి. శాస్త్రవిజ్ఞానం ప్రకృతి చెయ్యబోయే దారుణాలను ముందుగానే తెలిపి, ఆ నష్టాన్ని అరికట్టడానికి, అది సాధ్యపడకపోతే వీలయినంతగా ప్రాణ, ధన నష్టాన్ని తగ్గించుకోడానికి సలహాలు చెపుతూనే వుంది.

కాని ఏం లాభం? ఇదంతా బూడిదలో పోసిన పన్నీరు కాకుండా వుంటుందా యిక ముందరైనా?

మానవత్వం కాదు, సమాజం పట్ల కనీస బాధ్యతవున్న ఏ వ్యక్తి అయినా యీ ఘోర నేరానికి తన్ను తాను దోషిగా భావించుకోవలసిన పరిస్థితి యిది. అంతవరకూ పోనక్కరలేదు. ఇప్పుడు కలిగిన కాస్తంత చలనమైనా తాత్కాలికమే. చలనమో, సంచలనమో స్వంతానికి నష్టం వచ్చినప్పుడే జరుగుతున్నది. సామాజిక చింతన అన్నది చిలుక పలుకులుగా మాత్రమే ఉన్నది.

ఇల్లు తగలబడుతోంటే వస్తువులు కైంకర్యం చేద్దామనో, కనీసం చుట్ట ముట్టించుకుందామనో ఆలోచించే బుద్ధిమంతుల్లాగా, యీ దుస్థితిని తమ పబ్లిసిటీ కోసం ఉపయోగించుకుందామనో, లేకపోతే తమ ప్రతికక్షుల మీదికి ప్రయోగించి లాభపడదామనో ఆలోచించే పెద్దమనుషులే యిప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఎక్కడెక్కడ్నుంచో వీళ్ళు ఎగిరి వచ్చి, స్థానికంగావున్న తమ మద్దతుదార్లతో మంతనాలు జరిపి, ఫోటోలు దిగి పత్రికలను ఆక్రమించడంలో చూపే శ్రద్ధ, నష్టపడిన వారిని ఆదుకోవడంలో కనిపించడం లేదు. శాయశక్తులా శ్రమపడి సేవ చేస్తున్న వారికి అడ్డంకులు కల్పించిన ఉదంతాలూ లేకపోలేదు.

ఈ జలగండంలో నరక బాధలు పడి, ఘోర మానసిక క్షోభ ననుభవించి, తమ శవాలకు దహనమో, ఖననమో జరిగే భాగ్యానికైనా నోచుకోని వేలవేలమంది అభాగ్యులపట్ల, జీవచ్ఛవాలుగా కాకుండా సజీవులుగా వున్నా మనుకునే వారి బాధ్యత తేమిటి

తరవాత తరాలకైనా యిటువంటి నరక బాధలు అనుభవంలోకి రాకుండా చేయవలసిన దేమిటి?

సవ్యమైన సమాజంలో యిటువంటి ప్రకృతి అరిష్టం దాపురించినా, దాని నష్టాన్ని తప్పించుకునే కట్టుదిట్టాలు ముందుగానే జరిగివుండేవి. జరిగిన నష్టాన్ని సరిదిద్దే ఏర్పాట్లు వెను వెంటనే జరిగివుండేవి. మనిషి మనిషి ఆప్త బంధువుగా ఆదుకునే వుండేవాడు. ఈ అపార నష్టం, అశేష ప్రజానీకం అనుభవించిన ఘోర యాతనలు గుణపాఠంగా వుండేవి.

ఇటువంటి దురవస్థకు కారణమైన వ్యవస్థకు, యీ దురవస్థను ఆపే సమర్థత లేని వ్యవస్థకు యిప్పట్లాగే సాగడానికి అర్హత లేదు; ఎంత మాత్రమూ అర్హత లేదు. దీనిని మార్చాలి, పూర్తిగా మార్చివెయ్యాలి.

అవినీతికి, అసమర్థతకు, నిర్దయకు, పైశాచిక స్వార్థానికి, సమాజ క్షేమంపట్ల అలక్ష్యానికీ, సకల విధాలైన క్షుద్రతలకు తావుగల వారిదే పైచేయిగావున్న సమాజం బాగుపడదు; ముమ్మాటికీ బాగుపడదు; ఇది ప్రజలకు కనీస క్షేమమైనా కలిగించదు.

ఆలోచించవలసిన అనుభవం యిది. తపన పడవలసిన అనుభవం యిది. గుణపాఠంగా వుండవలసిన అనుభవం యిది.

ఆంధ్రప్రదేశ్ తుఫాను బాధితుల నిధికి 'అభ్యుదయ' వసూళ్ళు

అభ్యుదయ	రూ. 100-00
కె. యం. బాబుసెట్టి	100-00
సోవియట్ సమాచారశాఖ సిబ్బంది	908-00
బి. యన్. కె. ప్రెస్ సిబ్బంది	332-00
శ్రీ వి. నాగరాజరావుగారి ద్వారా వసూళ్ళు	176-00
డా॥ ఎ. విజయలక్ష్మి	25-00
శ్రీమతి డి. సీతాదేవి	10-00
శ్రీ యం. వి. రావు	51-00
ఇతర వసూళ్ళ ద్వారా	30-00
మొత్తం	1732-00
1-12-77 ముఖ్యమంత్రి నిధికి పంపినది	1100-00
నిల్వ	632-00

★ హిందూస్తాన్ హమారా ★

మొహమ్మద్ ఇక్బాల్

సారే జహాన్‌సె అచ్ఛా హిందూస్తాన్
హమారా
హమ్ బుల్బులేన్ హైన్ ఉస్కీ ఒహ్
గులిస్తాన్ హమారా

పోటిలేని మేటి మన హిందుస్తానం;
మనం బుల్బులులం, అది మన
నందనవనం.

గుర్బత్‌మె హోన్ అగర్ హం
రహతా హై దిల్ వతన్‌మే
సమ్‌ఝో వహీన్ హమేన్‌భీ దిల్‌హో
జహాన్ హమారా

పై దేశాల్లోవున్నా మన హృదయం
స్వదేశంలోనే వుంటుంది. హృదయం
ఎక్కడుంటే అదే మన దేశం.

పర్బత్ ఒహ్ సబ్‌సె ఊంచా
హమ్సాయ ఆస్మాన్‌కా
ఒహ్ సంత్రీ హమారా, ఒహ్ పాస్‌బాన్
హమారా

అన్నిటికన్నా ఎత్తుగా, ఆకాశా
న్నంటే ఓ పర్వతం మనకు రక్ష.

గోదీమె ఖేల్తీహైన్ ఉస్కీ హజారోన్
నదియాన్
గుల్షన్‌హై జిస్‌కె దమ్‌సె రష్కె-
జహాన్ హమారా

దాని ఒడిలో వేలాది నదులు
ఆడుకొంటున్నాయ్. అవి మన
దేశాన్ని సర్వప్రపంచం ఈర్ష్య చెందే
పూదోటను చేస్తున్నయ్

అయ్ ఆబ్‌రూద్ గంగా ఒహ్ దిన్‌హై
యాద్ తుఝ్‌కో
ఉత్రా తెరే కినారె జబ్ కార్వాన్
హమారా

గంగమ్మా, మా బిడారు నీ తీరాన
విడిసిన ఆ రోజు గుర్తుందా?

మజ్‌హబ్ నహీన్ సిఖాతా ఆపస్‌మె
బైర్ రఖ్నా
హిందీ హైన్ హం, వతన్‌హై
హిందూస్తాన్ హమారా

మతం పరస్పర వైరం నేర్పదు;
మనం హిందీలం, మనది హిందు
స్తానం.

యూనాన్, మిస్ర్, రోమా సబ్
మిట్‌గయే జహాన్‌సె
అబ్‌తక్ మగర్ హై బాఖీ నామొనిషాన్
హమారా

గ్రీసు, ఈజిప్టు, రోమ్ నాగరకతలు
అంతరించాయి. కాని మన పేరూ,
ఊరూ మాయలేదు నేటికీ.

కుఛ్ బాత్ హై కెహస్తీ మిట్తీ నహీఁన్
హమారీ
సదియోన్ రహాహై దుష్మన్
దౌరెజమాన్ హమారా
ఇక్బాల్ కోయి మహ్రం అప్నా
నహీఁన్ జహాఁన్‌మె
మాలూమ్‌క్యా కిసీకో దర్దెనిహాఁన్
హమారా

కాలం శతాబ్దాలుగా మనపై కత్తి
కట్టివుంది, కాని మన జాతి వ్యక్తిత్వం
మాసి పోలేదంటే విశేషమే మరి
ఇక్బాల్, మన కెవరూ ఆప్తులు
లేరీ లోకంలో, మన మనసులో
బాధ ఎవరి కెరుక?

మేఘాలకు రాగాలు పూస్తా!!

'శిరీష'

నేను నటిస్తూ-వినోదిస్తే
సంతోషం రంగులు పూసుకుంటుంది.
అప్పుడు....
గరళాన్ని నా కంఠాన దిగమ్రింగినా
విషాదం మాత్రం దరికి రాదు!!
మరిప్పుడు నేను,
ఉషస్సులోని అరుణిమను
కలుపుతూ, దానితో
మేఘాలకు రాగాలు
పులుముతున్నాను.
నా కన్నీరు
లావాలా పొంగి, తపించినా
దాన్ని "తోషవారిధి" కమ్మని శపించి
ఊసరవెల్లిని వరం అడిగి
నా వదనానికి విశేషతల
వర్ణాలని పూసుకున్నప్పుడు-
నా జోలికి ఏ ఘాతం రాదు!

ఉక్రోషాన్ని, ఆక్రోశాన్ని
నీలిమవర్ణంతో తుడిచేసి,
హరివిల్లు నడిగి,
పాత రోజాకే బంగారు రంగును
ప్రీతిగావేసి, తాజాగా చెయ్యమని
విరాళిగా నా కళాక్రియను సాగిస్తే!
శోకం అంతా సాగరంలోకి పరిగెట్టదూ!
ఏమైనా నేను—
ఉషస్సులోని అరుణిమను
కలుపుతూ, దానితో
మేఘాలకు రాగాలను
పులుముతున్నంత సేపూ....
ఆ వస్తువలకి వాస్తవిక తెక్కడిది?
భ్రాంతి వదలనిదే
క్రాంతి కోరే వాటికి
కాంతి ఎక్కడిది?!!

.... సోమసుందర్ ....

పరాభవం

ఓరీ నన్ను పరాభవించ కలిగానని ఎంత గర్వంతో ఊగి పోతున్నావురా? నన్ను ఏమీలేని వాణ్ణి చేశానని, నన్ను నిరాయుధుణ్ణి, నిరాశ్రయుణ్ణి, నిరాకారుణ్ణి చేశానని ఎంత ఆనందంతో పొంగి పోతున్నావురా?!

అరే మూర్ఖుడా, ఇంకెన్నాళ్ళు నీ పొంగు?
కవిత్వం రాసే ఈ నా చేయి రేపే నీ నివాసంలో మొండి చేయిగా మొలుస్తుంది!
నీకు నిలవ నీడ లేకుండా తరుముతుంధి:

నీ సుఖనిద్రా స్వప్నాలలో నీ గుండెలపై నా చేయి నిలుస్తుంది.పిడికిలి బిగించి ఉరుముతుంది!

నీ విలువల్ని తారుమారు చేస్తుంది. నీ పాపిష్టి చరిత్రపై తారు పులుముతుంది.
నీ క్రౌర్య ప్రకరణాలకు భరతం పడుతుంది....
తప్పదురా, ఇంకెంతో కాలం పట్టదు!

దావాగ్ని

ఈ దేశం నిండా ఆకలి దావాగ్నిలా అలుముకుంటోందని చెప్పారనే కదూ, ఒరెరే అధికారీ - అడవుల్లో కొండల్లో చాటు మాటుగా చంపేశావు నా తమ్ముల్ని!

నా తమ్ములు - కరుణించని విప్లవ కశాఘాతమ్ములు!

నిదిరించని వారి అంతరాత్మలు ఆరని జీవశిఖలు....ఈ దేశం గుండెలపై నడిచే నదీ తరంగాలకు పరమాప్తులు వారు.... నును మెత్తని పచ్చికపై మచ్చికగా మసలే లేబ్రాయపు ఉదయ కిరణాలు....;సమీక్ష వీచుల అంతరంగాలు వారు!....నిదురించే ఈ జాతి స్వప్న తరంగాలు!

పిచ్చి గాలి

గాలి కన్నుగీటి ఈలవేసి పిలిస్తే-సిగ్గుల మొగ్గలు క్రుమ్మరిస్తూ ముడుచుకు పోయిందీ నేల....

చెట్లు మౌన తపస్సుకు పూలు సఫల జయకేతనా లెత్తినపుడు అదే పరమార్థమనుకుందీ నేల!

శిశువు చిత్ర నిద్రలో విరిసిన మృదుస్మేరంలోనో, బిగించి ఊపే పిడికిళ్ళ కసిలోనో - ఒక శృంగార హేలనే దర్శించీ మురిసిందీ నేల ...!

ఈ నేల మరీ యింత గిడసబారిన స్వైరిణిగా ఎప్పుడు మారింది?
గాలి ఈలవేసి పిలిస్తే పులకించి పోయిందీ నేల!

అదా వట్టి పోకిరీ గాలి, అసలే అది పడమటి గాలి....

ఎర్రని స్వప్నం

దూరపు చీకటి కీకారణ్యాలలో ఎక్కడో ఒక కోకిల ఇప్పుడిప్పుడే నిద్రమేలుకుంది.

లోకపు చీకటి దుప్పట్ల మీదికి బాకాల బాకులు విసురుతోంది.

ఇప్పుడే జగత్తు కలపరపడుతోంది. మెల్లగా మేలుకుంటోంది.........దుస్తులు మార్చుకుంటోంది. నేను లేచాను. మెల్లగా కదిలాను. నా రాత బల్ల చేయెత్తి పిలిస్తే

వెళ్ళి దగ్గర కూర్చున్నాను. నింపాదిగా నిమిరాను....

నన్ను నేను ఒలక బోసుకుంటు న్నాను. నా దారి నేనే చీల్చుకుంటున్నాను

ఏరులై వాగులై ప్రవహిస్తున్నాను

నా నడక ముళ్ళ తుప్పల కొండల్లోంచి కాదు. తెల్లని మైదానాలలోంచి....ఆకు పచ్చని ఆనందాల తోటి ......ఎర్రని స్వప్నాల నుంచి....

వెన్నెల బయళ్ళ మీదుగా....కరుళ్ళు కరుళ్ళుగా....

అలా అలా అలలుగా కలలుగా అణు వులుగా....

నా తమ్ములకు విపంచికా మధుర స్మృతులుగా .... రేపటిని నేడే నిలిపే సుధాస్రవంతిగా!....

[కాలం వీలునామాలో-2, 3, 7, 8 పర్వాలు]

టి. ప్రసన్నకుమార్ .... చిత్రం

నిప్పని తెలిసే
ముట్టిన వాళ్ళకు
పట్టిన గతి ఏమిటి?

చేతులు కాలడమా
కాదు....కాదు....
దేశాలేలడం!!

అందుకే రాజకీయం
ప్రేతమైనా
ప్రేయసే కొందరికి!

యస్. జి. టి. చంద్రశేఖర్ .... రెండు భావాలు

బూర్జువా పెద్దపులి
ఇంటి ముందు కాలు కాలిన
పిల్లిలా యిటు అటూ
తిరుగుతున్న నాకు
కనిపించిందొక దృశ్యం-
ఎవరో వీధిలోకి విసిరిన
విస్తరిని కుక్కల్లా
తలా కొంచెం చించుకుని నాకుతూ
తృప్తి పొందక ఆ ఆకున లాగే
నమిలి మింగిన శుష్క శరీరాలు
మానవాభ్యుదయానికి ప్రతీకలు
నా కళ్ళముందు కాట్లాడుతున్నారు
నీకే ఎక్కువ నాకే తక్కువని.
ఆ సమయంలో నాకు కలిగాయి
రెండే రెండు భావాలు.

నికృష్ట జీవితాల్ని సాగిస్తూ
అత్యల్పులుగా బ్రతికే వీళ్ళపై
నా మరతుపాకి లోంచి
బులెట్ల వర్షం కురిపించాలా? అనీ
చీకూ చింతా లేక
చే జిక్కిన ధనంతో
మదోన్మత్తుడై ప్రవర్తించే
స్థూలకాయునిపై మరతుపాకీ
గురిచూపి
తుపాకి విషాగ్నికి ఎరచేసి
అక్రమార్జితమైన అతని సర్వస్వాన్నీ
శుష్క శరీరులకు పంచిపెట్టి
నిశ్చింతగా జైలు గోడలమధ్య
గోళ్ళు గిల్లుకుంటూ
జీవితం సాగించాలా? అనీ.

★ సంగ్రహ వార్తలు ★

పులుపుల శివయ్య జయంతి

కీ॥ శే॥ పులుపుల శివయ్య జయంతి గుంటూరులో అభ్యుదయ రచయితల సంఘం అధ్వర్యాన జరిగింది. డా॥ రాజారామ్ అధ్యక్షత వహించారు. శ్రీయుతులు సంగం కోటీశ్వరరావు, కె. ఎస్. రావు, అమరావతి కృష్ణమూర్తి, డి. వి. అప్పారావు, నాళం నరసింహారావు, శ్రీ పార్వతీశం ప్రభృతులు ప్రసంగించారు.

కడప జిల్లా రచయితల 4వ మహాసభ

కడప జిల్లా రచయితల నాల్గవ మహాసభలు నవంబరు 13, 14 తేదీలలో కడపలో జరిగాయి. డా॥ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. దేవులపల్లి రామానుజరావు, డా॥ పురిపండా అప్పలస్వామి, డా॥మల్లెమాల వేణుగోపాలరెడ్డి, శ్రీయుతులు జానమద్ది హనుమచ్ఛాస్త్రి ప్రభృతులుఈమహాసభలలో పాల్గొన్నారు.

ఇరసం"వెలుగు రేఖలు"అవిష్కరణ

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో గల ఇరసం తొలిసారిగా ప్రచురించిన "వెలుగు రేఖలు" పుస్తకాన్ని నవబరు 14 వ తేదీన అవిష్కరించారు. "సమాజ చైతన్యానికి రచయిత పాత్ర"అంశంపై గోష్టి జరిగింది. తర్వాత జరిగిన కవి సమ్మేళనంలో స్వీయకవితా పఠనం జరిగింది.

పుడమి కలవరించింది

ఒక మిట్ట మధ్యాహ్నం
అహస్కరుడు
ఒట్టి తస్కరుడై
నిరక్ష రేఖ మీద
నిరక్ష కుక్షిగా నడుస్తున్నాడు
భూమిని సమీపించి
మెడ తడుముతున్నాడు
గ్రీష్మం హాస్పిటల్లో
వెలుతురు బెడ్డుపై
అస్వస్థతగా నిద్రిస్తోంది
అప్పుడు భూమి
కాలం గుంట నక్క
ఎక్కడా నీడ దొరకక్క
కాస్తంత తిండి దొరకక్క
ఉప్పు పొదల మీద
కీచు గొంతుక పరిచింది
మతి భ్రమించిన
రోగిష్టి పీనుగులా
చింపిరి జుట్టు
విరబోసు కున్నాయి చెట్లు
వేళ్ళ మునివ్రేళ్ళ క్రింద
తొక్కిపెట్టి
ఊడల కాళ్ళమధ్య బంధించి
తమ నీడల్ని తామే
కబళిస్తున్నాయి చెట్లు
పెట్టిన గ్రుడ్లన్నిటిని
పిల్లలుగా మార్చిన త్రాచు
ఆకలితో పొట్టను
పెట్టుకుంటోంది
గాలి ఎలుగు బంటిలా
గొడ్డులకు చచ్చి
చెట్లకొమ్మల్లో వ్రేలాడుతోంది
మట్టి మగతగా పడుకొంది

2

ఇది ఇచ్చికం కాదు
కాని ఇది పచ్చి నిజం
ఇది ఎప్పుడు మాత్రం
ఆరోగ్యంగా ఉందని
కన్నీళ్ళు కారుస్తూ నవ్వుతుంది
నవ్వుతూ తిడుతుంది
ఎప్పుడైనా ఉషోదయంతో లేచిందీ?
పిల్లల్ని సింగారించిందీ?

3

పుడమి నిద్రలో కలవరించింది
ఎవ్వరికీ అర్థం కాని
శాంతి వచనాలు వల్లించింది
ఊసర క్షేత్రాలపై
పచ్చని పావడులు కప్పమంది
పండిన గింజలు
పదిమందిని పంచుకొమ్మంది
ఏ అరుణ కాంతులు
ఈమె తనయుల్ని రక్షించగలవు
నిశాతమస్సుల బుసల నుంచి
ఏ వైద్యు లీమెని
మృత్యువాత నుండి తప్పించ గలరు?

విరియాల లక్ష్మీపతి

మేము సాహిత్యవేత్తలం. మాకూ, రాజకీయాలకూ సంబంధం లేదు అనే వాళ్ళ సంకుచిత దృష్టికి నేను జాలిపడడం మానలేదు. సాహిత్యానికీ, రాజకీయాలకీ అవినాభావ సంబంధం ఉంది. ఈ సంగతి ఎంత పెందరాళ గుర్తిస్తే అంత మంచిది.

రాజకీయ సమస్యలంటే జీవిత సమస్యలు. సాహిత్య సమస్యలు కూడా అంతే.

శ్రీ శ్రీ

ప్రత్యేక వ్యాసం

ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర

కంభంపాటి సత్యనారాయణ

ఏనుగుల వీరాస్వామయ్య గారు చెన్నపట్టణవాసి, ఆంధ్ర నియోగ బ్రాహ్మణుడు.

1780 ప్రాంతంలో జన్మించి, పన్నెండవ యేట ఈస్టిండియా కంపెనీ కొలువులో "వలంటీరు"గా ప్రవేశించి, చిన్న ఉద్యోగాలు కొన్నిచేసి, 1819 లో మద్రాసు హైకోర్టులో తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో అనువాదాలు చేసే "ఇంటర్‌ప్రెటర్"గా ప్రవేశించారు. తర్వాత "ప్రధాన ఇంటర్‌ప్రెటర్" పదవి నలంకరించారు. కంపెనీ కొలువులో ఆయన ఆంగ్లేయ న్యాయమూర్తులందరి మన్ననలు పొంది, 1835 లో కొలువు చాలించుకొన్నారు. మరుసటి సంవత్సరం దివంగతులయారు.

వీరాస్వామయ్యగారు 1830 మే నెల నుంచి 1831 సెప్టెంబరు వరకు సకుటుంబంగా సకల పరివారంతో, మద్రాసునుంచి కాశీ వరకు మేనాలలో హైదరాబాద్ మీదుగా యాత్ర జరిపి, కలకత్తా మీదుగా తిరిగి మద్రాసు చేరుకున్నారు. తాను స్వయంగా చూచిన, విన్న విషయాలను అయన డైరీలు, జాబుల రూపంలో వ్యావహారిక తెలుగులో వ్రాసుకున్నారు. అవి పుస్తకరూపంలో 1838 లో ఒకసారి, 1869లో రెండవసారి ప్రచురింపబడ్డాయి. ఆ తర్వాత, 1941లో శ్రీ దిగవల్లి వేంకటశివరావు (విజయవాడ) మద్రాసులోని ప్రాచ్య లిఖిత భాండాగారంలోని వ్రాత ప్రతిలో ఉన్న కొన్ని విశేషాంశాలను సందర్భాను సారంగా పేర్కొంటూ, మూడవ ముద్రణను ప్రచురించారు. ఇది 374 పేజీల గ్రంథం. పీఠిక, అనుబంధం, అకారాది విషయ సూచిక మొదలైన వాటిని కూడా కలుపుకొంటే, 480 పేజీలవుతుంది.

19 వ శతాబ్ది పూర్వార్ధ భాగంలో భారతదేశపు రాజకీయ, సాంఘిక పరిస్థితులను తెలుసుకొనగోరే చారిత్రక పరిశోధకులకు వీరాస్వామయ్య గారి కాశీ యాత్ర చరిత్ర ఒక అమూల్యమైన సాధనం.

ఈస్టిండియా కంపెనీ మన దేశంలో పాలనాధికారాన్ని చేబట్టిన రోజులవి. మద్రాసు, బొంబాయి, కలకత్తాలు రాజధానులుగా కొన్ని ప్రాంతాల్ని తమ ప్రత్యక్ష పా క్రిందికి తెచ్చుకున్నారు. మిగతా ప్రాంతాల్లో సంస్థానాధీశుల్ని మిత్రులుగా చేస ని, మిగతావారి స్వతంత్ర హోదాను గుర్తిస్తూ, ప్రజల ఆచార వ్యవహారాల్లో అం జోక్యం చేసుకోకుండా, "శాంతి భద్రతలను" కాపాడ్డం తమ ప్రధాన కర్త గా పరిగణించారు. 1830 నాటికి, చెన్నపట్నపు జెండాక్రింద సాలుకు "సుమారు ఒకటుంకాలు కోటి వరహాలు" వసూలయ్యేది; ఖర్చు సుమారు రెండుకోట్ల వరహాలు. స్థిర చరాస్తుల విలువ మూడు కోట్ల వరహాలు. సిపాయిల సంఖ్య 50,000.

సముద్రంమీద వచ్చేపోయే సరుకుల మీద సుంకం వసూలు చేసేందుకు సముద్ర తీర కస్టం హౌస్ ఒకటీ, గట్టున వచ్చేపోయే సరుకులమీద సుంకం వసూలుకు లాండ్ కస్టం హౌస్ ఒకటీ ఉండేవి.

వీరాస్వామయ్య తన పర్యటనానుభవాల్లో పేర్కొన్న రాజకీయ పరిస్థితులు మిక్కిలి ఆసక్తి దాయకమైనవి. ఉదాహరణకు, హైదరాబాదు జంట నగరాల చూట్టూ సారవంతమైన భూమి ఎంతో వున్నప్పటికీ, అక్కడి రయితుల్లో సాగుచేసే శ్రద్ధ లేదు. ఎందుచేతంటే, ఆయుధపాణులయిన వుద్యోగులు పండిన పంటను అనుభవించ నీయరు. అంతేకాదు. సంస్థానంలో అనేకమంది జమీందార్లు నవాబుకు కొంత కప్పం కట్టి తమ జమీలలో స్వతంత్ర పరిపాలన చేస్తూ వుండేవారు. వారిలో సైన్యం అధికంగా వున్నవారు కప్పం చెల్లించకుండా ఎగవేసేవారు. అటువంటి సందర్భాలలో నవాబు తన సైన్యంతో దండెత్తివచ్చి, బలవంతంగా కప్పం వసూలు చేసుకునేవాడు. జమీందారుల మధ్య సఖ్యత చెడినప్పుడు ఒకరితో ఒకరు పోట్లాడుకుని చావడమేకాక, ఒకరి గ్రామాల నొకరు కొల్లగొట్టుకుని రైతుల్ని నానాహింసలకు గురిచేసేవారు.సంస్థానంలో మంత్రిపదవు లలంకరించిన చందూలాల్ ప్రభృతులు ద్రవ్యకాంక్షతో, జమీందార్ల మధ్య కలహాలను పెంచి పోషించేవారు. "ఇలాంటి ప్రారబ్ధము నా ప్రయాణ కాలములోనే వనపర్తి జమీనుదారునికిన్నీ, కొల్లాపురపు జమీనుదారునికిన్నీ ఒక సంవత్సరముగా పొసగి తహతహ పడుచున్నది" అని వీరాస్వామయ్యగారు తెలియజేశారు. కప్పం కట్టని జమీందార్ల స్థానే నవాబు ఇంగ్లీషు కలెక్టర్లను నియమించటం కూడా కద్దు. కాని, సంస్థానంలో ఊరికొక జమీందారు చొప్పున వున్నందున, "రహితుల కున్ని తరులకున్ను క్షేమము లేక, ప్రాణ భయముతో సదా కాలము తోయుచు నుండవలసి యున్నది."

పెద్ద జమీందారీలలో జడచర్ల ఒకటి. దానిక్రింద 360 గ్రాములుండేవి. దాని నుండి నైజాం నవాబుకు రాబడి మూడు లక్షల రూపాయలు.

ఇక, ఈస్టిండియా కంపెనీ క్రిందనున్న జమీందార్ల విషయం. వీరు కావలసినంత సిబ్బందిని ఉంచుకొని "గజాంతైశ్వర్యములు" అనుభవిస్తూ కాలం గడిపేవారు. మధ్య పరగణాలలోని రీమా జమీందారు ఆదాయం సంవత్సరానికి రు 10 లక్షలు. బీహారులోని టంకారి జమీందారు ఆదాయం రు. 50 లక్షలు. అందులో కంపెనీకి చెల్లించేది రు. 3 లక్షలు మాత్రం. ఆంధ్ర దేశంలోని కందనూరు (కర్నూలు)నవాబు ఈస్టిండియా కంపెనీకి సాలీనా రు. 1 లక్ష చెల్లించేవాడు. అతడు సొంతంగా ఒక కోర్టును స్థాపించి న్యాయ విచారణ చేసేవాడు. శ్రీశైలం దేవాలయం మీద అతనికి హాసీలు మూలకంగా సంవత్సరానికి రు. 18000 రాబడి వస్తున్నా, దేవాలయానికి మరమ్మతులుండవు. ఎవరయినా మరమ్మత్తు చేయిస్తే, దానికైన ఖర్చుతో సమానమైన హాసీలు వసూలు చేస్తున్నాడు. ఎవరయినా దేవికి ఆభరణాలు, వస్త్రాలు సమర్పిస్తే, వాటి ఖరీదుతో సమానమైన హాసీలు పుచ్చుకోవడమే కాక, కొన్ని రోజుల

తర్వాత వాటిని అపహరిస్తాడట. గంజాం జిల్లాలో వసూలయే రు. 12 లక్షలలో రు. 6 లక్షలు జమీందార్లనుంచి వచ్చేది. హరిశ్చంద్రపురం లగాయితు నరసన్నపేట వరకు గల గ్రామాలలో ప్రజలు నిద్రలేకుండా గడుపుతున్నారు. కారణ మడిగితే, అక్కడి జమీందారు బందిపోట్లను పురిగొల్పుతున్నాడట. తన మీద సాక్ష్యం చెప్పే వారి ఊళ్ళన్నీ కొల్లగొట్టించి తగల పెట్టిస్తానని బెదిరిస్తున్నాడట. ఆ రోజుల్లో విజయనగరం జమీందారు రైతుల నుంచి పంటలో సగం మాత్రమే వసూలు చేసుకొనే వాడు. అందుచేత అతడు ప్రజలకు అభిమాన పాత్రుడయ్యాడు. తాను అప్పుల పాలైనా, ప్రజలచే స్తుతింపబడేవాడు. వర్ణాశ్రమ ధర్మం ప్రకారం అతడు సకుటుంబంగా కాశీ వాసం చేస్తున్నందుకు, రాజ్యవాసులు "తల్లిని కానని బిడ్డలవలెనే తల్లడింపుచున్నా" రని వీరాస్వామయ్య గారు వ్రాస్తున్నారు.

విశాఖపట్నం జిల్లా యావత్తూ జమీందారీ ప్రాంతం. దానిమీద సాలు సరి రాబడి రు. 14 లక్షలు. పెద్దాపురం జమీందారీ రు. 3 లక్షల రాబడి గలది. కొచ్చెర్లకోట జమీందారు కంపెనీకి ఏటా చెల్లించే పేష్కసు రు. 3 లక్షలు. పూర్తిగా జమీందారీలతో నిండిన కాకినాడ జిల్లా రాబడి 8 లక్షల వరహాలట. మచిలీపట్నం రాబడి 6 లక్షల వరహాలట.

దేశంలో రాజకీయ సుస్థిరత లేనందున, శాంతి భద్రతల రక్షణకు కంపెనీ పూర్తి ఏర్పాట్లు యింకా చేయనందున అరణ్య ప్రాంతాల్లో దారి దోపిళ్ళు మిక్కుటంగా జరిగేవి. ఉదాహరణకు, కడప నుంచి నిర్మల్ వరకు "డాగా వాండ్లనే" దొంగల ముఠాలు వర్తకుల్నీ, యితర ధనికుల్నీ నరికి చంపి, సంపదను కొల్లగొట్టుకొని, త్రుటి కాలంలో మాయమయ్యేవారు. వింధ్య పర్వత ప్రాంతంలోని ఊళ్ళనుంచి నర్మదా నది వరకు ప్రయాణం చేయడం బహు దుర్లభం. ఆ మధ్య నున్న ఊళ్ళపేర్ల తాత్పర్యం ఆ ఊరు విడిచి నర్మద చేరితే తల్లి కడుపులో నుంచి మళ్ళీ పుట్టడమన్నమాట.

ఒరిస్సా ఏజన్సీలో మన్యం దొరలు (వీరిలో కొందరిని కొండ జమీందార్లు అనేవారు) దోపిళ్ళు, హత్యలు చేయించేవారు. ఈ బాధ నుంచి తప్పించుకొనేందుకు కలెక్టర్లు, తదితర ఆంగ్లేయులు సైతం బరంపురంలో బంగాళాలు కట్టించుకొని నివసించేవారు. ఈస్టిండియా కంపెనీ, యీ ఉపద్రవంనుంచి పౌరుల్ని కాపాడేందుకు, మార్గ మధ్యంలో పబ్లిక్ చావళ్లు కట్టించి, ఒక్కొక్క చావడికి 25 గురు రాజా జవాన్లను నియమించారు. వీటిలో కొన్నిటిని వీరాస్వామయ్య స్వయంగా చూచారు.

మధ్య పరగణాలలో లాల్‌గంజ్ అనే ఊరు చేరుకొనేందుకు మూడు నదులు దాటవలసి వచ్చిందట. వాటికి వంతెనలు కట్టడానికి కంపెనీ చేస్తున్న ప్రయత్నాలను ఆయన పరికించాడు. దేశంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి అంచెలంచెలుగా టపాలు మోసుకుపోయే సౌకర్యం కూడా చేయబడింది. మార్గ మధ్యంలో లోతైన వాగులు దాటవలసి వస్తే, వాగుకు యిరువైపుల రెండు కొయ్యలు నాటి, వాటి తలలకు ఒక కప్పీతాడు కట్టేవారు. తపాలా కట్ట రాగానే, యిరువైపుల కాచుకుని

చూన్న నౌకర్లు దానిని కప్పీకి కట్టివేస్తే, దానిని అవతలి పక్కవాడు లాక్కునేటట్లు చేసేవారు.

కంపెనీ వారు తమ అధికారం క్రిందనున్న ప్రాంతంలో సాధారణ విద్యను ప్రోత్సహించసాగారు. వీరాస్వామయ్య తన గ్రంధంతో యిలా వ్రాశారు: "కాశీలో సకల గ్రంథములున్ను సంగ్రహింబడి వున్నవి. కుంఫిణీ వారు బహుదినములుగా ఒక పాఠకశాలను వుంచి సమస్త గ్రంథాలు సంగ్రహించి యుంచి పాఠము చెప్పను మనిషికి 60 రూపాయిలు జీతముచేసి పదిమంది పండితులను వుంచి చదవడానకు 100 మంది విద్యార్థులకు మూడేసి రూపాయలు లెక్కను జీతమునుచేసి యుంచినారు. యింకా రాజాధి రాజులు గ్రంథ సంగ్రహము కావలసినప్పుడు లక్షావధి రూపాయలు కాశికి పంపించి గ్రంధ సంగ్రహము చేయుచున్నారు" ఇలాగే, కంపెనీ వారు కలకత్తా లోను, మద్రాసులోను కొన్ని పాఠశాలలు, కళాశాలలు స్థాపించారు.

• ఈస్టిండియా కంపెనీ ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్య వీరాస్వామయ్య గారి వంటి విద్యాధికులపై గణనీయమైన ప్రభావం కలుగజేసింది. ఆయన మారిస్ అను ఆంగ్లేయునితో చర్చిస్తూ, హిందూ మతానికి చెందిన ఆది స్మృతులేవీ (ఇవి మొత్తం 18) సహగమన దురాచారాన్ని సమర్థించలేదని తెలియజేశారు. ఆయనిలా వ్రాశారు: "నేను బహుదినాలుగా యీ సంగతిని విచారింపుచున్నాను; ఉపస్మృతులలో యీ విషయానకు అనేక ఆకారములున్నవి గాని మూల స్మృతులలో లేవని చెప్పినంతలో యిక్కడి కోటు పండితులు తద్వ్యతిరిక్తముగా చెప్పి, తుదకు మూల స్మృతులలో సహగమనానికి ఆకరము లేదని ఒప్పుగొన్నారు". అగ్రకులస్థులు క్రింది కులస్తుల్ని, ముఖ్యంగా అంటరాని వారిని, హీనంగా చూస్తూండడంచేత: దక్షిణ దేశంలో క్రైస్తవ మతం వ్యాప్తిచెందుతోందని రచయిత తెలియజేశారు. "సమానత్వము పొందగల మతములోనే ప్రవర్తింపుచున్నామని, క్రీస్తుమతస్తుల ప్రేరేపణకు లోపడుచున్నారు" అని అన్నారు. హిందూమతావలంబకుల జుగుప్సాకరమైన ఆచారాలు భగవంతునికి అపరాధాలుగా తోచినవని, వాటిని ఆటంకపరచుటకు యింగ్లీషు వారిని యీ కర్మభూమిని ఏలేటట్లు చేసినాడనీ రచయిత తన అభిప్రాయంగా తెలియజేశారు. "వారు సర్వాంతర్యామి కటాక్షానికి పాత్రులయి సర్వోత్తమ మయిన యీ కర్మభూమికి సార్వభౌములయినారని తోచుచున్నది" అని ఆయన వ్రాశారు.

బ్రిటిష్ పాలకులు మన దేశంలో నిర్వహించిన ద్వంద్వపాత్రలో (విధ్వంసక పాత్ర, పునరుజ్జీవన పాత్ర) విద్యాధికుల్ని అధికంగా ఆకర్షించింది పునరుజ్జీవన పాత్ర అనడంలో సందేహం లేదు. రాజా రామమోహన రాయ్. వీరేశలింగం పంతులు మొదలైన సంఘసంస్కర్తల్ని ఉత్తేజపరచింది యిదే. మన వీరాస్వామయ్య గారిని కూడా యిదే ఆకర్షించినట్లు తోస్తుంది. (సశేషం)

దాహం! వెఱ్ఱి దాహం! నోరు పిడచ గట్టుకు పోతూంది. కళ్ళు, కాళ్ళూ, తేలిపోతున్నాయి. పళ్ళు బిగబట్టి, కళ్ళను బలవంతాన విప్పుతూ రిక్షా తొక్కుతున్నాడు వెంకటరమణ. వీధి కుళాయి కనపడగానే ప్రాణం లేచొచ్చింది. రిక్షా ఆపి కుళాయి తిప్పాడు. ఒక్క బొట్టు కూడ పడలేదు. ఉసూరుమంటూ రిక్షా దగ్గర కొచ్చాడు.

"వెంకటరమణా!" అల్లంత దూరం నుంచి బిగ్గరగా పిలుస్తున్నా రెవరో. కళ్ళ నొకసారి తుడుచుకుని పరకాయించి చూసేలోగా ఆ మనిషి దగ్గరకొచ్చి సైకి లాపాడు.

కథానిక

దాహం

డా॥(శ్రీమతి)విజయలక్ష్మి

"ఒరేయ్! డాక్టరు గారు నిన్ను నిల్చున్న పళాన లాక్కు రమ్మన్నారు. దా! దా!!" నిప్పుల్లో నిల్చున్నట్లు వెంకట రమణని తొందర చేసి సైకి లెక్కేసాడు డాక్టరు ప్రభాకర్రావుగారి కాంపౌండర్. నాలుక పీక్కుపోతున్నా మారు మాట్లాడకుండా రిక్షా ఎక్కాడు వెంకటరమణ.

"ఏంటి పంతులు గారూ? డాక్టరు బాబెందుకు రమ్మన్నాడు?"

"కేసొచ్చింది. నీ గ్రూప్ కావాలంట".

అదీ నా గ్రూప్ రక్తం కావలసి వచ్చేప్పటికి నన్ను వెదుక్కుంటూ వచ్చాడు. ప్రొద్దున్న చేతిలో పైసా లేక కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలినా తన రక్తం తీసుకోనన్నాడు. ఎప్పుడూ పాతికిచ్చేది, యిరవై రూపాయ లిమ్మన్నా వద్దు పొమ్మన్నాడు. "ఎ. బి. గ్రూప్ ఎప్పుడో గాని అవసరం రాదు. రక్తం తీసుకున్నాక వారం రోజుల్లోపల ఉపయోగించకపోతే అది నీ నెత్తినో, నా నెత్తినో పోసుకోవాల్సిందే తప్పా మరెందుకూ పనికిరాదు. ఐనా నీ రక్తంలో హిమొగ్లోబిన్ ఏభయి పర్సెంటు కూడ లేదు, నీ రక్త మెక్కిస్తే ఏం ఉపయోగంరా బాబూ! పైగా ఎక్కడెక్కడ తిరిగి ఛస్తున్నావో వి. డి. ఆర్. ఎల్. పాజిటివ్ వచ్చింది. నీ రక్తం ఎక్కించి నాడికి ఉపయోగం లేక పోగా లేనిపోని జబ్బులు చుట్టుకుంటాయి" అని విదిలించి పారేసాడు ప్రొద్దున్న.

తన ముఖాన పాతిక రూపాయలు పడేసి వంద రూపాయలు కమ్ముకుంటాడు, రక్తం సీసా. తన లాంటి వాళ్ళ రక్తంతో వ్యాపారం చేసి వేలకు వేలుగడిస్తున్నా యీ డాక్టరు ధనదాహం తీరదు. దాహం! మళ్ళీ తన దాహం గుర్తుకొచ్చింది వెంకటరమణకు. నోరు తడుపుకుంటే గాని ప్రాణం నిలిచేట్లులేదు.

హాస్పిటల్ దగ్గర బండాపి ముందు పైపు దగ్గరకెళ్ళి దోసెడు నీళ్ళు పట్టి ఆబగా త్రాగాడు. నీళ్ళు లోపల కెళ్ళగానే అగ్గిలో నెయ్యి పోసినట్లయింది. నొప్పితో మెలికలు తిరిగిపోయాడు.

"ఒరేయ్! అక్కడ తచ్చిళ్ళాడుతున్నావేంటిరా? దా! దా!" కాంపౌండర్ అదిలించాడు. పొట్ట నొక్కుకుని బాధనాపుకుంటూ కాంపౌండర్ వెకత లోపలికెళ్ళాడు.

వెంకటరమణ ఒంట్లో రక్తం బొట్టు

బొట్టుగా సీసాలో చేరుతూంది. వాలిపో తున్న కళ్ళని విప్పి సీసా వంక చూశాడు. ఉపయోగంలేని రక్తం! జబ్బు లంటించే రక్తం! అయినా ధర వంద రూపాయలు!

పాతిక రూపాయలు తీసుకుని బయటి కొచ్చి నెమ్మదిగా రిక్షా యీడుస్తూ ఆలో చిస్తున్నాడు. ఒంట్లో రక్తం అమ్ముకుని యీ డబ్బు సంపాదించాడు. మళ్ళీ అంత రక్తం తన ఒంట్లోకి రావడానికి యీ డబ్బుకు పదింతలైనా చాలదు. అయినా తప్పదు. తనకిప్పుడు అర్జెంటుగా డబ్బు కావాలి. తన చెల్లి తలుపులమ్మకు రాక రాక పదేళ్ళకు కడుపొచ్చింది. పుట్టింటాళ్ళు గర్భదరిద్రులని తెలిసికూడ పుట్టింటి ఆశ చావక పది రోజు లుండి వెళదామని వచ్చింది. దానికి బలానికి కాస్త మందు, మాకు కొనివ్వకపోతే మానె, కనీసం కడుపునిండా తిండికూడ పెట్టలేక పోతు న్నాడు. అది చాలదన్నట్లు నిన్నటినుంచి జ్వరం దానికి.

"ఒరేయ్! రమణా!" ఆలోచనల్లో నించి బయటపడ్డాడు రమణ. పక్కింటి నారాయుడు గబగబా తన వైపు వస్తు న్నాడు. వెంటనే యింటి దగ్గర చెల్లమ్మ కళ్ళ ముందు నిలిచి, అప్పటిదాకా చిన్నగా అరుస్తున్న పేగులు వేగంగా కదిలి పొట్ట చేత్తో పట్టుకుని విలవిల లాడాడు.

"ఒరేయ్! చప్పున పదరా! నీ కోసం రెండు గంటల్నుంచి తిరుగుతున్నాను. తలుపులమ్మకి బట్టలయి పోతున్నాయి. ఆ రక్తం కాలువలు చూసి కళ్ళు బయర్లు కమ్మేసినాయి. పెద్దాస్పటలుకు తీసు కొచ్చాం. ఇదిగో. వెంటనే రక్తం ఎక్కిం చాలన్చెప్పి రక్తం అర్జంటుగా కొనుక్కు రమ్మని యీ సీసా కాత్తంత రక్తం ఏసిచ్చారు." గ్రూపింగుకి, క్రాస్ మేచింగ్‌కి యిచ్చిన బ్లడ్ శాంపిల్స్ రమణ చేతిలో పెట్టాడు నారాయుడు.

ఒక క్షణం మెదడు మొద్దుబారి నట్ల యింది. మరుక్షణం పూనకం వచ్చిన వాడిలా డాక్టరు ప్రభాకర్రావు బ్లడ్ బ్యాంకుకు పరిగెత్తాడు రమణ. ఒగరుస్తూ సీసాలిచ్చి డాక్టరుతో విషయం చెప్పాడు. గ్రూపింగ్ చేసి డాక్టరు రమణ వంక జాలిగా చూసాడు.

"నీ చెల్లెలిదీ ఎ. బి. గ్రూపే రమణా! నువ్వు గుమ్మం ఎక్కేముందే నీ రక్తం కొనుక్కున్నవాళ్ళు వెళ్ళిపోయారు."

"బాబూ. మళ్ళీ తియ్యండి. నా ఒంట్లో రక్తమంతా తీసి నా చెల్లెలి కివ్వండి. చప్పున తియ్యండి బాబూ!" రమణ దీన మైన ఏడుపుకి డాక్టర్ కరిగిపోయాడు.

యాంత్రికంగా రక్తం యివ్వడం, తీసు కోవడం తప్ప యీ విషయం గురించి ఎక్కువ లోతుగా ఆలోచించని డాక్టరు తన బ్రతుకు తెరువుకు ముందునుంచి వాడుకుంటున్న సమిధల్లో ఒకడైన రమణ హృదయ విదారకంగా ఏడు స్తూంటే చలించిపోయాడు. "రక్తం మీద వ్యాపారం చెయ్యడం యీ పవిత్ర భారత దేశంలో తప్ప మరెక్కడా లేదు. మిగతా దేశాల్లో మనుషులు రక్తాన్ని దానం చేస్తారు. ఈ దేశంలో మనుషులు రక్తం దానం చేస్తే ప్రాణమే పోతుందని హడలి చచ్చిపోయే మూర్ఖులు. అంచేతే తన లాంటివారు మనుషుల డబ్బు అవసరాన్ని ఆధారంగా చేసుకుని యీ వ్యాపారాన్ని నడిపించేస్తున్నారు.

ఇది తప్పని తెలిసి కూడా యీ పని చెయ్యకపోతేనేం? అని డాక్టరు అంతరాత్మ నిలదీసింది. "యీ సమాజంలో రక్తాన్ని అమ్ముకోవలసిన పరిస్థితి, కొనుక్కోక గత్యంతరంలేని పరిస్థితి వున్నన్నాళ్ళు తను కాకపోతే మరొకరు, మరొకరు, యీ వ్యాపారాన్ని సాగిస్తూనే వుంటారు, అప్పుడప్పుడు రక్తదానం చెయ్యడంవల్ల ఆరోగ్యానికేమీ ముప్పు లేదని, పైగా దేహారోగ్యానికి దోహదం చేస్తుందని ప్రజలకి తెలిసి, విరివిగా రక్తదానం చేసే పరిస్థితు లొచ్చేవరకు, మనిషి పట్టెడు తిండికోసమో, గ్రుక్కెడు సారా కోసమో రక్తాన్ని అమ్ముకునే పరిస్థితులు మారే వరకు మరో దారి లేదు. నేనొక్కడిని మడిగట్టుకు కూర్చున్నందువల్ల పరిస్థితులు మారవు" అని అంతరాత్మను జోకొట్టాడు డాక్టర్.

"బాబూ అక్కడ నా చెల్లి చావు బ్రతుకుల్లో వుంది. దాని ప్రాణం నిలపండి". డాక్టర్ కాళ్ళమీద పడ్డాడు వెంకటరమణ.

"రమణా! ఇప్పుడు నీ ఒంట్లో రక్తం తీస్తే ఆ అమ్మాయి ఈ రక్తంతో బ్రతకదు సరికదా, ముందు నువ్వు చచ్చిపోతావు."

"నేను చస్తే చచ్చాను. ముందు నా చెల్లి ప్రాణం కాపాడండి బాబూ!"

డాక్టరు కేం చెయ్యాలో వెంటనే తోచలేదు. తనేమీ చెయ్యలేక పోతున్నందుకు బాధగా వుంది. యీ వూళ్ళో మరో బ్లడ్ బ్యాంకు లేదు. జనరల్ హాస్పిటల్లో ఆనవాయితీ ప్రకారం ఎప్పుడూ బ్లడ్ ఉండదు. ఎ. బి. గ్రూప్ డోనర్సులో యింతకు ముందు ఊరంతా గాలిస్తే పట్టుకోగలిగినది ఒక్క రమణనే. మళ్ళీ వాళ్ళ కోసం మనుషుల్ని పరుగెత్తించినా.... వాళ్ళొచ్చేసరికి ఆ అమ్మాయి యెలా వుంటుందో!.... టైము చాలా విలువైనది.

"రమణా! ఎ. బి. గ్రూప్ లేనప్పుడు బి. గ్రూప్ రక్తం ఎక్కించొచ్చు. ముందు బి. గ్రూప్ క్రాస్‌మేచ్ చేసిస్తాను. తీసుకెళ్ళు. యీలోపు ఎ. బి. గ్రూప్ బ్లడ్ కోసం ప్రయత్నిద్దాం." తనను కరుణించి సాక్షాత్తూ ఆ దేముడే దిగి వచ్చినట్లు డాక్టరు వంక చూశాడు రమణ. యిప్పటిదాకా యీయనెంత కర్కోటకుడను కున్నాడు తను! యీయనకి ధనదాహం అని ఎంతగా తిట్టుకున్నాడు! తను పొరపాటు పడ్డాడు. ఎంత మంచి వాడిలోనూ ఎక్కడో దానవుడు దాగున్నట్లే ఎంత కర్కోటకుడిలో కూడా ఎంతో కొంత మంచి కూడా వుంటుంది. ఆ మంచి బయటకొచ్చే బలమైన ఘటన రావాలి. తను, తనలాంటి వాళ్ళు, డాక్టరు.... అంతా పరిస్థితులకు బానిసలు, యీ వ్యవస్థ చేతిలో కీలు బొమ్మలు ...కాంపౌండర్ని అడిగి మంచినీళ్ళు తీసుకుని నెమ్మదిగా ఒకొక్క గుక్క త్రాగుతున్నాడు వెంకటరమణ. యిందాకటిలా కడుపులో నొప్పి రాలేదిప్పుడు, కడుపు చల్లబడి నట్లయింది.

గ్లాసు ఖాళీ చేసేటప్పటికి డాక్టర్ రక్తం సీసా అందించాడు. కాళ్ళు తేలిపోతున్నా బలవంతాన గుమ్మందాటాడురమణ.

"ఓరి రమణా; నీ చెల్లెలు కొంప ముంచేసి నాదిరో" అంటూ ఎదురుగా పరుగెత్తుకొస్తున్నాడు నారాయుడు. దబ్బున క్రింద కూలిపోయాడు రమణ. చేతిలో రక్తం సీసా పగిలి, తనలోని రక్తాన్ని భూమ్మీదకు నెట్టి, భూమి దాహం తీర్చింది.

కాలనాళికలూ - కంకాళాలు

"విశ్వామిత్ర"

ఈ మధ్య ఢిల్లీలో ఎర్రకోట దగ్గర పది రోజులపాటు, రాత్రింబవళ్ళు, ఫ్లడ్ లైట్ల వెలుగులో, ఎద్దులతో పనిచేసే నిసరైన స్వదేశీ యంత్ర సహాయంతో చరిత్ర సంబంధమైన ఒక త్రవ్వకం జరిగింది. ఈ త్రవ్వకంలో బైటపడే చరిత్ర విషయాలు ఎంత ముఖ్యమైనవో, అసలవి చరిత్ర అవునో కాదో కూడ చెప్పలేం గాని, చరిత్రకోసం జరిగిన ఈ త్రవ్వకం, ఖుద్దున భారత విద్యామంత్రి సమక్షంలో, పదిమంది పార్లమెంటు సభ్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో టెలివిజన్, డాక్యుమెంటరీ చిత్రీకరణల సందడిలో, యుద్ధ ప్రాతిపదిక మీద చరిత్రాత్మకంగా సాగింది. మూడున్నర మీటర్ల కైవారంతో, 32 అడుగుల లోతు త్రవ్వి కాలనాళిక అనే ఒక చరిత్ర కంకాళాన్ని బైటికి తీశారు.

ఈ చరిత్రను తవ్వి తీయటం ఎంత ఆర్భాటంగా జరిగిందో, సరిగ్గా 51 మాసాల పైన మూడు వారాల క్రిందట, భారత స్వాతంత్ర్య 25వ వార్షికోత్సవం సందర్భంగా 1973 ఆగష్టు 15న దాన్ని పూడ్చి పెట్టటం కూడా యింతే ఆర్భాటంగా జరిగింది. దేశ చరిత్రలో ప్రధాన ఘటనలని తా మనుకొన్న వాటిని పది వేల పదాల్లో, తమ కిష్టులైన చరిత్రకారుల చేత వ్రాయింపించి, పల్చటి అల్యూమినియం రేకుల మీద అందంగా చెక్కించి, ధగధగ మెరిసే, గాలి చొరని స్టెయిన్లెస్ స్టీల్ పేటికలో పెట్టి, అప్పటి ప్రధాని దాన్ని స్వహస్తాలతో పదిలంగా భూస్థాపితం చేశారు.

అందులో ఏముందో మాకూ కాస్త చెప్పండి అని ఆ నాడు ప్రతిపక్షం వారడిగితే, పాలకపక్షంవారు అది మీ కనవసరం, అదంతా ఐదు వేల సంవత్సరాల తరవాత వచ్చే తరాల వారి కోసం వుద్దేశించిందే తప్ప మీకోసం కాదు పొమ్మని దబాయించారు. ఆ నాడా పని చేసినవారూ, చేయించిన వారూ సామాన్యులేమీ కాదు. ఇంత గొప్ప చరిత్రాత్మక "ప్రాజెక్టు" స్ఫురించింది మొదట ఒక ఐ. సి. ఎస్. ఆఫీసరుకో, ఐ. ఏ. ఎస్. ఆఫీసరుకో నంటున్నారు. కాని ఆచరణలో పెట్టిన వారు మాత్రం చరిత్రను కాచి వడపోసిన పండితులూ, ఒక ప్రపంచ ప్రసిద్ధ చరిత్రకారుని పుత్రికా రత్నమూను. అయినా వారికా క్షణాన ఓడలు బండ్లు, బండ్లు ఓడలూ అవుతాయనే సామాన్య లోకజ్ఞానం లేకపోయింది. తమకు తోచిందే చరిత్ర అనుకున్నారు; తమకు తిరుగు లేదనుకొన్నారు. అదేదో రాసి, దాన్ని లోతుగా పాతేసి, దాని తాలూకు మసాయిదాను "కిస్సా కుర్సీకా" నెగిటీవ్ లను కాల్చేసినట్లు ఎక్కడో మాయం చేశారు.

పూర్వకాలంలో అశోకుడు ధర్మసూక్తులు చెక్కించి రాతి స్తంభాలు పాతించాడు. దాతలు దాన శాసనాలు చెక్కించి, దేవుడి కన్నా ముందు తమ పేర్లు ప్రముఖంగా కనిపించేలా, దేవాలయాల ముంగిళ్ళలో

నాటించారు. రాగి పలకల మీద శాసనాలు చెక్కించిన వాళ్ళూ వున్నారు. భూర్జ పత్రాలూ, తాళపత్రాలూ తప్ప కాగితాల్లేని రోజుల్లో మన పూర్వీకులు యిలా చేయడంలో సబబు వుంది. వాళ్ళా పని ఏ వుద్దేశంతో చేసినా అది నేడు గత చరిత్రకు ఆధారంగా మనకు వుపయోగపడుతోంది. కాని, యిరవయ్యో శతాబ్ది చరమ పాదంలో, కాగితాలూ, అచ్చు యంత్రాలూ అన్నీ వున్న ఈ రోజుల్లో కిలోలేమి ఖర్మ, టన్నుల తూకంతో చరిత్ర గ్రంధాలు వెలువడుతున్న ఈరోజుల్లో ఈ కాలనాళికల ఖంగాళీ ఏమిటని మీరు నాబోటి అల్పజ్ఞుణ్ణి అడక్కండి. ఆ పని చేసిన వారినే ఆ మాట అడగండి. మీ అల్పబుద్ధికి అంతుబట్టని విషయాలు మీ కెందుకు బొమ్మని చీవాట్లు తినండి.

రోజులు మారాయి. ఆ నాడు ప్రతిపక్షంగా వున్నవారు ఈ నాడు పాలకపక్షమయారు. జరిగిన తప్పులు దిద్దుతామంటున్నారు. మంచిదే, కాలనాళికను బైటికి లాగారు; యింకా ఏవేవో కంకాళాలు బైటికి లాగుతున్నారు. అదీ బాగానే వుంది. కాని ఈ కాలనాళికలూ, కంకాళాలూ బైటికి తీయడమేనా, మా విషయ మేమన్నా పట్టించుకొంటారా అని జనం అడుగుతున్నారు. ధరలు పెరిగిపోతున్నాయి, పనుల్లేవు, ఫ్యాక్టరీలు మూసేస్తున్నారు, మా బోనస్ ఎగవేస్తున్నారు. ఇంకా యిలాంటివి ఎన్నో సమస్యలున్నాయి—ముందు వాటిసంగతి చూడండయ్యా బాబూ అని గోలపెడుతున్నారు.

పాలకులుగా వున్నవారు ముందు చేయవలసిందేదో, ఆ వెనుక తాపీగా చేయవలసిందేదో ఆలోచించటం మంచిది. అంతేగాని, మద్యపాన నిషేధమే పేదరికం నిర్మూలనకు ఏకైక మార్గమని హితవులు చెబుతూ, అదేదో "జీవజలాన్ని" గురించి పరిశోధనలవంటి మహాత్కార్యాలు చేస్తూ కూర్చుంటే జనంవూరుకోలేరు.

ఆశా జ్యోతి

విజయ క్షేమేంద్ర శాతకర్ణి

ఓ మృదు పద సజ్జిత
శాంతి గీతమా!
నీ ప్రియమైన మిలియన్ల
గళసీమల్ని నీరవం చేసి
ఎటు పారిపోయావు?
ఓ హో గులాబీ
ఈ పలయ పవన శోభిత
నందనం నుంచి
మందహాసాన్ని మాయంచేసి
ఎటు ఎగిరి పోయావు?
నీ 'లాలిమ' ధారవోసి
ఈ గులక రాళ్ళను
కెంపులుగా మార్చాలని
కలలు గన్నావే?
ఈ ఇసుక దారిని
పాల పుంతగా తీర్చాలని
కలవరించావే?
మరి, ఇంతలోనే
ఎవరు పిలిచారని
ఎక్కడి పని అక్కడే
అర్ధాంతరంగా విడిచి
పయనమైనావే దూర తీరాలకు?

★ ఇంటర్వ్యూ కాల్ ★

వై. వి. ఎస్. ఎస్. ఎన్. మూర్తి

ఎంప్లాయిమెంటు ఎక్స్‌చేంజీ ఆఫీసు మెట్లు ఎక్కుతూ "ఇది ఎన్నో సారో రావడం ఇక్కడకు" అనుకున్నాడు రమణ. దారితెలిసిన మనిషిలా ఆఫీసులోకి తీసుకెళ్ళాయి, అరిగిపోయి తెగిపోవడానికిసిద్ధంగా ఉన్న చెప్పులు. టైప్‌మిషన్ల వాద్య సంగీతం మధ్య ఎడతెరిపి లేకుండా వ్రాస్తున్నాయి చేతులు, లౌడ్‌స్పీకర్లులా మొరుగుతున్నాయి గొంతులు, రెడ్‌టేప్‌ల మధ్య పెద్ద హోరు మధ్య తల ఎత్తకుండా కొన వూపిరితో వున్న బక్క బతుకులు కొన్ని ఫైళ్ళలో దూరి కాళ్ళమీద నిలబడ్డాయి. మధ్య మధ్య అక్కడక్కడ కుర్చీలో కూర్చొన్న బలసిన పంది కొక్కులు తలలెత్తి చూస్తున్నాయి.

ఆఫీస్‌లో అడుగుపెట్టిన రమణ్ణి గుమ్మం దగ్గరే అడ్డుపెట్టాడు దర్వానుడు. ఆఫీసనే పరమపద సోపానాల్లో దర్వానుడే మొదటి మెట్టు. లోపలికి పంపమని బ్రతిమలాడాడు రమణ. "వీల్లేదు" పొమ్మన్నాడు దర్వానుడు. "విధిలేదు" అన్నట్లు అటు-ఇటు చూసి అర్థరూపాయి బిళ్ళ దర్వానుడి గుప్పిటిలో పెట్టాడు రమణ, అంత వరకూ ధుమధుమ లాడుతున్న దర్వానుడి ముఖం ప్రసన్నంగా మారిపోయింది. "పెద్ద అయ్యగారు ఇప్పుడే వచ్చారు. బిజీగా ఉన్నారు, ఇంకా ఎవరెవరో పెద్ద పెద్ద బాబులు వచ్చారు. ఇప్పుడిక వీలు కాదు. ఇంకా ఒక గంట పోనివ్వండి. అంత వరకూ ఆ బల్లమీద కూర్చొండి" అని మర్యాద చేశాడు దర్వానుడు. రమణ బల్లమీద కూర్చున్నాడు. అతడు కూర్చున్నాడు గాని మనస్సు మాత్రం స్వాధీనం తప్పిన గుర్రంలా పరుగెడుతూనే ఉన్నది ఎటో.

తను బి.ఏ. ప్యాసయి రెండేళ్ళు అయింది. ఎంప్లాయిమెంటు ఎక్స్‌చేంజీలో పేరు నమోదు చేయించి ఆరు సంవత్సరాలయింది. ఇంతవరకూ సరైన ఇంటర్వ్యూ కాల్ రాలేదు. ఏవేవో నెల-రెండు నెలల టెంపరరీ వేకెన్సీలకు సంబంధించిన కాల్స్ వచ్చాయి. ఇంటర్వ్యూకి వెళ్ళినా ప్రయోజనం కనపడలేదు. "ఫోర్టులో ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి" అని అందరికీ తెలిసినట్లే తనకూ తెల్సింది, కాని "అక్కడ ఖాళీలు ఉన్నట్లు సమాచారం మాకేమీ అందలేదు" అంటారు ఎంప్లాయిమెంట్ ఎక్స్‌చేంజి వాళ్ళు. లేదు మేం పంపాం అంటారు ఫోర్టు వాళ్ళు, ఏది నిజమో తెలీదు కాని తనకంటే వెనుక పేర్లు నమోదు చేయించుకున్న వాళ్ళందరికీ ఫోర్టులో కాల్స్ వచ్చాయి. ఉద్యోగాలూ వచ్చాయి. తనకే రాలేదు ఇంతవరకూ ప్రక్కింటి వెంకటరత్నం ఫోర్టులో అక్కౌంటుంటు. ఖాళీలున్నాయని పేర్లు పంపమని ఎక్స్‌చేంజికి వ్రాసినట్లు కూడా చెప్పాడు. "నువ్వు ఎక్స్‌చేంజి నుండి పదో-పాతికో ఖర్చుపెట్టి కాల్ తెచ్చుకో! వెయ్యో!

కథానిక

రెండు వేలో ఖర్చయినా నీకు ఉద్యోగం దొరికే ఏర్పాట్లు నేను చేస్తాను." అన్నాడు. అతడి సలహామీదనే, ఏ విధంగానైనా ఈ వేళ కాల్ సంపాదించుకొనిఇంటికి వెళ్ళాలనే నిశ్చయంతో ఇంట్లోని స్టీలు కారియర్ 25 రూపాయలకి కుదువపెట్టి ఆ డబ్బు తీసుకొని వచ్చాడు. ముందు ఇంటర్వ్యూ కాల్ వస్తే కదా! తన యోగ్యతలతో (నిజానికి యోగ్యతలను బట్టి ఉద్యోగాలిస్తే!) ఉద్యోగం సంపాదించడానికి" అనుకున్నాడు రమణ.

రమణ గత రెండెండ్లలో లోక జ్ఞానం సంపాదించాడు. మానసికంగా కూడా ఎదిగాడు. కాని మనిషి కృంగిపోయాడు. ఎప్పటికప్పుడు నిరాశ ఎదురౌతున్నా, ఓర్పుతో ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు ఎందరెందరో నిరుద్యోగుల్లాగ. ఆలోచనల్ని ఛోంచేస్తున్న రమణ దర్వానుడి పిలుపుతో బాహ్యలోకంలోకి వచ్చాడు. "బాబూ! వేణు బాబు ఖాళీగా ఉన్నాడు. వెళ్ళి ఆయన్ని పట్టండి. మనిషి మాంచి ఉద్దండుడు, ఆవలిస్తే ప్రేవులు లెక్క పెడతాడు. మచ్చిక చేసుకొని పని జరిపించుకొండి" అని రహస్యం ఏదో చెప్పినట్లు చెప్పాడు దర్వానుడు.

రమణ సరాసరి వేణు సీటు దగ్గరకే వెళ్ళాడు. విష్ చేశాడు. సమాధానంగా తలపంకించి వచ్చిన పని ఏమిటన్నట్లు కళ్ళతోనే ప్రశ్నించాడు వేణు. సదరు వేణు గత ఆరేళ్ళగా అదే సీట్లో ఉండి కావల్సిన వాళ్ళెంతో మందికి ఇంటర్వ్యూ కాల్స్ పంపి, ఉద్యోగాలు చూపించి తన కంటూ చిన్న ఇల్లు, ఫర్నిచరు,బ్యాంకులో బ్యాలన్సు, భార్య-బిడ్డలకు నగా-నట్రా సంపాదించుకున్నాడు. మనిషి మాట్లాడ్డం-నిలబడ్డం-నడవడం అంత రూళ్ళ మీదనే. అందుకే అందరూ అతన్ని రూళ్ళ వేణు అంటారు. "సార్! నా పేరు నమోదు చేయించుకొని ఆరు సంవత్సరాలు అయింది సార్. బి.ఏ. ప్యాసయి రెండేళ్ళు అయింది. ఇంతవరకూ ఒక ఇంటర్వ్యూ కాల్ కూడా రాలేదు. నా కంటే జూనియర్లు మంచి-మంచి ఉద్యోగాలు సంపాదించు కున్నారు. ఫోర్తు గ్రేడులో ఏవో ఖాళీలు ఉన్నాయట మీరు పేర్ల జాబితా పంపిస్తున్నారని తెల్సింది. దయచేసి నాక్కూడా కాల్ పంపండి. నాకా అవకాశం కల్పించండి" అన్నాడు రమణ తడబాటు పడుతూ, పారం అప్పగించినట్లు.

"ఫోర్తుకా లిస్టు పంపించేశామే!" "మీకు కాల్ రాలేదా? అయితే అందులో మీ పేరు లేదన్నమాట" అన్నాడు వేణు.

"సార్! దయచేసి లిస్టులో నా పేరు చేర్పించండి నాకీ ఉపకారం చేయండి. మీ మేలు మర్చిపోలేను" అని ప్రాధేయపడ్డాడు రమణ.

"లాభం లేదు మిష్టర్! నేనేం చెయ్యలేను. మీరు వెళ్ళొచ్చు" అన్నాడు వేణు చిరాకుగా.

చేసేది ఏమీ లేక, ఏమి చేయాలో తెలియక దిగులుగా బయటకు నడిచాడు రమణ.

"సంగతేమిటి?"అన్నాడు దర్వానుడు.

జరిగిన విషయం చెప్పాడు రమణ.

"మీరుండండి బాబూ! ఆయన మాట నాకు తెలవదా! అనాగే అంటాడు. ఇలా రండి" అతనిని పిల్చి "తమ దగ్గర

ఏమయినా ఉందా! ఉంటే ఇవ్వండి. నిమిషాలమీద పని అయిపోతుంది" అన్నాడు దర్వాను. జేబులోనుండి పది రూపాయల నోటుతీసి కాగితంమీద పేరు, నెంబరు వేసి ఇచ్చాడు. దర్వానుడు లోపలికి వెళ్ళాడు. రెండు నిమిషాల తరువాత దర్వానుడు చిరునవ్వు నవ్వుకుంటూ వచ్చాడు.

"మీ పని నిమిషంలో అయిపోద్దిబాబూ! ఒకక్షణం ఆగారంటే పిల్చి కాగితం చేతి కిస్తారు" అన్నాడు దర్వానుడు.

రమణ బల్లమీద కూర్చున్నాడు. రెండు నిమిషాల తరువాత కాలింగ్ బెల్ మ్రోగింది. దర్వానుడు లోపలికి వెళ్ళాడు.

మరో నిమిషం తరువాత చేతిలో ఫ్లాస్కుతో బయటకు వచ్చి "అయ్యా తమర్ని వేణుబాబు పిలుస్తున్నారు వెళ్ళండి. తమరి పంట పండినట్లే. ఆనక మమ్మల్ని మరిసిపోకండి" అన్నాడు దర్వానుడు.

రమణ ఆతృతగా లోపలికి వెళ్ళాడు. వేణు సీటు దగ్గరనుండి మందహాసముతో మీసాలు మెలివేసుకొంటూ కంట్రాక్టరు వీరరాఘవయ్య తనవంక ఓరగా చూస్తూ బయటకు పోయాడు. వీరరాఘవయ్య కొమారుడు మురళి రమణ వయస్సువాడే. ఇంటర్ వరకూ కలిసే చదువుకున్నారు. ఇంటర్ పోవడంతో మురళి వెనకబడ్డాడు. రమణ బి. ఏ. ప్యాసయ్యే నాటికి గాని మురళి ఇంటర్ పూర్తికాలేదు. పనీ పాటా లేకుండా తిరుగుతున్న కొడుకును తన పనిలో పెట్టుకోవాలనుకున్నాడు వీర రాఘవయ్య. కొడుకు అప్రయోజకత్వాన్ని చూసి ఆ ప్రయత్నం మానేశాడు. ఏదైనా గవర్నమెంటు ఉద్యోగంలో వేయిస్తే తప్ప ప్రయోజనం లేదని రెండు నెలల క్రితమే కొడుకు చేత ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిలో రిజిష్టరు చేయించాడు. నిన్న మురళి కన్పించినప్పుడు ఈ విషయం చెప్పాడు. "బి. ఏ. ప్యాసయి రెండేళ్ళు దాటిన తనకే కాల్ రాకపోతే వీడికెలా వస్తుం"దనుకున్నాడు రమణ. వీరరాఘవయ్య ముఖాన్ని చూశాక తన ప్రయత్నం కూడా ఫలించినట్లుగానే భావించాడు రమణ. వేణు గేటుదగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు. వేణు రమణ రికార్డుకు సంబంధించిన ఫైలు, ఒక కవరు తీసుకొని తనతోపాటు రమణ్ణి ఆఫీసరుగారి దగ్గరకు రమ్మన్నాడు. రమణ, వేణు వెనుకనే ఆఫీసరు గారి గదిలోనికి వెళ్ళాడు.

ఆఫీసరు "ఏమిటి?" అన్నట్లు వేణు వంక చూశాడు. రమణ ఆఫీసరుకు నమస్కారం చేశాడు. ఆఫీసరు తల పంకించాడు. వేణు ఆఫీసరు ముందు ఫైలు పెట్టి చేతికి తెల్లకవరు అందించాడు.

"ఇదేమిటి?" అన్నాడు ఆఫీసరు.

"మీరే చూడండి సార్!" అన్నాడు వేణు. ఆఫీసరు కవరు తెరచి అందులో నుండి 10 రూపాయల కాగితం బయటకు తీసాడు.

"వాటీజ్ దిస్?" అని గర్జించాడు ఆఫీసరు.

"సార్! ఈయన ఫోర్టు ఇంటర్వ్యూ కాల్ లిస్టులో తన పేరు చేర్చమని 10 రూపాయలు పాదితోషకంగా ఇస్తున్నాడు సార్ నాకు" అన్నాడు వేణు వినయంగా.

ఆఫీసరు కళ్ళు అగ్నిగోళాలే అయ్యాయి. "మిష్టర్ రమణా! బి. ఏ. ప్యాసయిన వాడివి, యువకుడివి. నీలాంటివాళ్ళే

ఇలా ప్రవర్తిస్తే చదువు లేనివారి గతి ఏమిటి? నీలో యిప్పటినుండే అవినీతి బీజం నాటుకొని వుంది. నీలాంటి వానికి ప్రభుత్వ యంత్రాంగలో స్థానమిస్తే అది సమూలంగా విషపూరితమై పోతుంది. దేశభవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. నీలాంటి అవినీతిపరులకు ప్రభుత్వ కార్యాలయాల్లో స్థానం లేదు. నీ రిజిస్ట్రేషను కాన్సిల్ చేస్తున్నాను. నీ ప్రధమ తప్పిదంగా భావించి ఇదెంతటి నేరమైనా పోలీసులకు అప్పగించకుండా వదిలేస్తున్నాను" అన్నాడు ఆఫీసరు.

"సార్! సార్! దయ చూపండి!" అంటూ ప్రాధేయపడ్డాడు. కాని రమణ మొర ఆఫీసరు విన్పించుకోలేదు.

"వెళ్ళవయ్యా!" అంటూ కసిరాడు వేణు.

ఆఫీసరు వంక - వేణు వంక మార్చి మార్చి చూశాడు రమణ.

విసురుగా ఆఫీసరు గదినుండి బయటకు వెళ్తూ "ఛీ! కుక్క బ్రతుకు!" అన్నాడు రమణ. మనస్సంతా ముక్కలై పోయింది. కోపం లావాలా కుతకుతా ఉడుకుతూంది. శరీరం అంతా ఉద్రేకంతో వణుకుతుంది. ఎంత నిగ్రహించుకున్నా కోపం ఆవిరిలా బయటకు వస్తోంది.

"ఇక జన్మలో ఈ ఆఫీసు గుమ్మం ఎక్కకూడదు. వీళ్ళని ప్రాధేయపడేకంటే కాయికష్టంచేసి బ్రతకడం మేలు" అని అనుకుంటూ ఆఫీసు గేటు విసురుగా తన్నాడు. ఆ విసురుకు చిరకాలంగా కాళ్ళను అంటిపెట్టుకున్న చెప్పులు పుటుక్కున తెగిపోయాయి. ఇక వాటి అవసరం లేదన్నట్లు కాళ్ళతోనే ఆ ప్రక్కనున్న చెత్తకుండీవైపు విసిరి, జ్ఞానోదయం అయిన బుద్ధుడిలా, లోకాన్ని జయించిన వీరుడిలా ధీరత్వంతో జీవన సమరంలోనికి ఉత్సాహంగా అడుగు పెట్టాడు రమణ. *

*(కథానికా పఠనంలో చదివినది. గత సంచికలోని "పలుకే బంగారమాయె" అన్న శ్రీ పి. వి. శ్రీపతిరావు కథ కూడా.)

స్త్రీకి కుమార్తెపట్ల వుండే దృక్పథానికి, కోడలి పట్ల వుండే దృక్పథానికీ దురదృష్టవశాత్తు వైరుధ్యం వుంటున్నది—ప్రత్యేకంగా సాంప్రదాయక హిందూ సమాజంలో. ఆనందంగా వుండే అనేక దాంపత్యాలు తల్లికి, భార్యకు మధ్య సర్దుబాటు లేకపోవడం వల్ల నష్టపడుతున్నాయి, ముక్కలవుతున్నాయి కూడా. తన కుమార్తెకు ఆ కుమార్తె అత్తగారు చేసిన దానికి కోపం తెచ్చుకునే ఒకానొక భర్త తల్లి తన కోడలికి అదే పనిని చేస్తుంది చిత్రంగా. దేవతాస్వరూపంగా త్యాగమూర్తిగా, అపార ప్రేమాభిమానాల చిహ్నంగా తన బిడ్డల పట్ల వుండే తల్లి, అత్తగారి పాత్రలో పీడకురాలవగలదు.

(ఢిల్లీ హైకోర్టు యిచ్చిన ఒక తీర్పు నుండి)

మహాకవి ఇక్బాల్ [1877-1938]

'విశ్వామిత్ర''

సాటిలేని మేటి దేశం
మన హిందుస్తానం
మనం కోయిలలం
అది మన నందనం

అంటూ దాదాపు అర్ధ శతాబ్దం నాడు మధురగానం చేసిన కవి కోకిల (ఫారసీ బుల్బుల్ అందాం) మొహ్మద్ ఇక్బాల్‌ను భారతీయుడనవచ్చా అని మన పుణ్య భారత భూమి పాలకులెవరికో ధర్మసందేహ మొచ్చి, మన దేశంలో ఆ మహాకవి శతజయంత్యుత్సవాన్ని జాతీయ స్థాయిలో జరపాలనుకొన్న అంతకు ముందు పథకానికి అడ్డుపుల్ల వేశారు. మన దేశం నుంచి ప్రసిద్ధ పాత్రికేయుడు, చలనచిత్ర దర్శకుడు ఖాజా అహ్మద్ అబ్బాస్, ప్రముఖ ఉర్దూకవి సర్దార్ జాఫ్రీ, ఆ మహాకవి జీవితాన్ని చలన చిత్రంగా నిర్మిద్దామనే సంకల్పంతో పాకిస్తాన్ వెడితే, అక్కడి అధికారులు, యెవరయ్యా మీరు, ఎందుకొచ్చారు, మా ఇక్బాల్‌తో మీకేమిటి పని అన్నట్లు వారిని అనాదరణ చేశారని విన్నాం. ఇలాంటి ప్రబుద్ధుల ఆటలు సాగితే, వీళ్ళు దేశాల్ని, దేశాల తాలూకు ఆస్తుల్నే కాదు, ఇక్బాల్‌ను, గాలిబ్‌ను, ప్రేమ్‌చంద్‌ను, క్రిషన్ చందర్‌ను, నజ్రుల్ ఇస్లాంను కూడా ముక్కలకింద తెగ్గోసి పంచేసుకుంటారనేందుకు సందేహం లేదు.

అటు పాకిస్తాన్‌లో, యిటు భారతదేశంలో, హిమాలయాల మొదలు కన్యాకుమారి వరకు,హిందీ, ఉర్దూభాషా ప్రాంతాల్లోనే గాక, అన్యభాషా ప్రాంతాల్లో సైతం సంస్కృతీ పరులూ, సాహిత్యాభిమానులూ గత నెలలో, ఇక్బాల్ మహాకవి శత జయంతి సందర్భంగా జరిపిన అసంఖ్యాక సభలూ, సమావేశాలు, సాహిత్య గోష్ఠులూ ఈ కుసంస్కారులకు, వక్రబుద్ధులకు చక్కని సమాధాన మనవచ్చు.

ఉర్దూ,పార్సీ భాషల్లో సందేశాత్మకమైన విప్లవ కవితలల్లి, దాదాపు నాలుగు దశాబ్దాలపాటు భారతీయ సాహితీ జగత్తును ఏకధాటిగా ఏలిన,భారతీయ ముస్లిముల్లో సాంస్కృతిక వికాసానికీ, తన విప్లవ కవితలతో సామ్రాజ్యవాద వ్యతిరేక భావాల ఉద్దీపనకూ ఎంతో కృషిచేసిన మహాకవి మొహ్మద్ ఇక్బాల్ 1877 నవంబర్‌లో సియాల్ కోటలో (పంజాబ్-పాకిస్తాన్), దాదాపు 150 సంవత్సరాల క్రితం కాశ్మీర్ నుంచి వలస వచ్చి అక్కడ స్థిరపడిన ఒక నిరుపేద ముస్లిం కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి పెద్దగా చదువు సంధ్యలు కలవాడు గాకపోయినా, సాహవాస ఫలితంగా సూఫీతత్వాన్ని బాగా వంటబట్టించుకున్న సంస్కారపరుడు. ఇక్బాల్ తల్లి కూడా నిష్ఠపరురాలైన ముస్లిం. తల్లిదండ్రుల మతాభినివేశమూ, తాత్వికదృష్టి, నైతికవిలువలూ, ఇక్బాల్ భావి

ఇక్బాల్ మొదట సియాల్‌కోటలో, ఆ తరువాత లాహోర్‌లో చదివారు. 1899లో లాహోర్ విశ్వవిద్యాలయం నుంచి తత్వ శాస్త్రంలో ఎం. ఏ. పట్టా పుచ్చుకున్నారు. ఒక సంపన్న కుటుంబంలోని యువతిని పెండ్లాడి, అత్తవారింటి సాయంతో, యింజనీరింగ్ పట్టభద్రుడై, ఓ పెద్ద ఉద్యోగంలో కుదురుకొన్న ఇక్బాల్ అన్నగారు, తలిదండ్రుల పోషణభారం తనపై వేసుకుని, తమ్ముణ్ణి పై చదువులకోసం విదేశాలకు పంపారు. ఇక్బాల్ ఇంగ్లాండులో న్యాయశాస్త్రం, జర్మనీలో తత్వశాస్త్రం అభ్యసించారు. ఆయన పాశ్యాత్య తాత్విక ధోరణులను లోతుగానే అధ్యయనం చేశారు. కాని, మౌలికంగా ఇస్లామ్ సిద్ధాంతాలను నమ్మిన ఆయన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రబోధించే విలువలను ఆమోదించలేకపోయారు. దేవుడు సృష్టించిన ప్రపంచాన్ని తుపాకుల బలంతో తన లాభాల కార్ఖానాగా మార్చిన సామ్రాజ్యవాదమూ, పెట్టుబడిదారీ నాగరకతా పతనం కాక తప్పదని ఆయన 1908 నాటికే నిర్ధారణకు వచ్చారు.

ఇక్బాల్, ఇస్లాం బోధలను, కొంతవరకు పాశ్చాత్య తాత్విక ధోరణులను, భగవద్గీత బోధలను మేళవించి తన ఆత్మ సాక్షాత్కార సిద్ధాంతాన్ని రూపొందించుకున్నారు. మానవుడు తన శారీరక, ఆత్మిక శక్తులన్నిటినీ పరిపూర్ణంగా వికసింపజేసుకొని, భగవంతుడు ప్రారంభించిన కృషిని సృజనశీలంగానూ, చైతన్యయుతంగానూ కొనసాగించాలని ఈ సిద్ధాంత తాత్పర్యం. భగవత్ సృష్టికి పరిపూర్ణత కల్పించే లక్ష్యంతో నిరంతర కార్యాచరణ సాగించటం మానవుని విధి అని ఆయన బోధించారు.

ఇక్బాల్ విద్యార్థి దశలోనే కవితా వ్యాసంగం ఆరంభించారు. దేశభక్తి, ప్రకృతి వర్ణన, ముస్లింల దీన స్థితి, మత సామరస్యం—ఇవీ ఆ నాడు ఆయన ప్రధాన కవితా వస్తువులు.

విదేశాల్లో విద్యాభ్యాసం ముగించుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన తదుపరి, యించుమించుగా 1910 తరువాత ఆయన రాసిన కవితల్లోని ప్రధాన వస్తువులు రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యలే.

ఇక్బాల్ చింతనపై అన్నిటికన్నా గొప్ప ప్రభావం కల్పించిన ఘటన 1917 అక్టోబరు సోషలిష్టు విప్లవమని నిస్సందేహంగా చెప్పవచ్చు. 1923లో వెలువడిన ఆయన కవితా సంకలాన్నిబట్టి చూస్తే ఆయన, మార్క్స్, ఎంగిల్సు, లెనిన్‌ల రచనలను బాగా లోతుగా అధ్యయనంచేసినట్లు కనిపిస్తుంది. అక్టోబర్ సోషలిస్టు మహా విప్లవాన్ని అభినందిస్తూ రాసిన కవితలో ఆయన,

"పుడమి తల్లి గర్భంనుంచి
నవభాను డుదయించాడు,
ఆకాశమా, అస్తమించిన
తారకలకోసం యింకెందుకు
నీ పరితాపం" అన్నారు.

రష్యా బోల్షెవిక్కుల ఆర్థిక కార్యక్రమాన్ని యించుమించు అంతా ఆయన ఆమోదించారు. కాని, వారి చారిత్రక భౌతిక వాదాన్ని మాత్రం ఆయన అంగీకరించ

లేదు. ఇస్లాం బోధలనూ, కమ్యూనిజం మూల సూత్రాలనూ సమన్వయ పరచేందుకు ఆయన ప్రయత్నించారు.

ఖురాన్ బోధలను ఉటంకించి, కమ్యూనిజం మౌలిక ఆర్థిక సూత్రాలను ఆయన సమర్థించారు. తన శ్రమఫలితం కానిదేదీ మనిషి సొంతం కాదన్న సూత్రాన్ని పేర్కొని యితరుల శ్రమ ఫలితాన్ని భుక్తం చేసుకునే హక్కు పెట్టుబడిదారుకు లేద న్నారు. చేరెడు గింజలు, ఆరడుగుల నేల తప్పిస్తే భూస్వామికి భూమిమీద ఎలాంటి హక్కులేదన్నారు....ఉత్పత్తి సాధనలపై వ్యక్తిగత యాజమాన్యాన్ని ఖండించారు....

ఇస్లాంకు, కమ్యూనిజానికీ మధ్య ఇక్బాల్ దృష్టిలోవున్న పొత్తు వింతగా కనిపించవచ్చును, కాని ఆలోచించదగ్గదీ, అది ఆయన ఆలోచనా ధోరణిని తెలిపేది కూడా. ఈ విషయాన్ని గురించి ఇక్బాల్ యిలా అన్నారు: "ఇస్లాంనుంచి దేవుణ్ని తొలగిస్తే, బోల్షెవిజం అవుతుంది; బోల్షెవిజానికి దేవుణ్ని కలిపితే ఇస్లాం అవుతుంది."

ఇస్లాం మతాన్ని వర్తమాన వైజ్ఞానిక యుగ అవసరాలకు తగినట్లు మలిచేందుకు కృషి చేసినందువల్ల, ఇస్లాం మతాన్ని ఆలంబనగా చేసుకొని సోషలిస్టు ఆర్థిక సూత్రాల్ని ప్రచారం చేసినందువల్ల ఆయన రచనలు ఆ నాడు భారతీయ ముస్లింల సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఎంతైనా ఉపకరించాయి. ఆయన తాను నమ్మిన ఇస్లాంను కీర్తించినా, ఏ యితర మతాన్ని ద్వేషించలేదు; ఉత్కృష్టమైన మానవతా వాదాన్ని ప్రచారం చేశారు. "నా తాతముత్తాతలు బ్రాహ్మణులు, వారు భగవంతుని కోసం అన్వేషణలో జీవితాలు గడిపి వేశారు. నేను పరిపూర్ణ మానవుడి కోసం అన్వేషిస్తున్నాను" అని ఆయన చెప్పుకున్నారు.

ఇక్బాల్ తాత్త్విక చింతనను, ఆయన రాజకీయ కార్యకలాపాలు కొన్నిటిని (లాహోర్‌లో జరిగిన ముస్లిం లీగ్ మహాసభలో పాకిస్తాన్ తీర్మానాన్ని ఆయన ప్రతిపాదించారు. అయితే పాకిస్తాన్ భావనకు, ద్విజాతి సిద్ధాంతానికి ఆయన ఆద్యుడని చెప్పటం సత్యదూరం) మనం ఆమోదించలేక పోవచ్చు. కాని, ఉర్దూ, ఫార్సీ సాహిత్యా నికి, భారతీయ ముస్లింల సాంస్కృతిక పునర్వికాసానికి ఆయన కూర్చిన దోహదం అనన్యం. ఆయన విడిచి వెళ్ళిన సాహితీ వారసత్వం మనకెంతో విలువైనది.

రవ్వలు

ఆయాచితుల హనుమచ్ఛాస్త్రి

(ఈ తలపు రవ్వలు రవ్వంతసేపు నిప్పు రవ్వలుగా వెలిగి అనంతంలో లీన మౌతాయి. అందుకే వీటిని 'రవ్వల' నడం. —రచయిత)

1

తుప్పు పట్టిన కలం
నిప్పులేమి కురుస్తుంది?
చప్ప చప్ప కూర
ఉప్పునే ముంటుంది?

2

మబ్బులేని నింగికి
నిబ్బరం గాకేమి?
మబ్బులుండే నింగి
బొబ్బరిల్లు తుంది

3

కుంగదీసే లోకం
మింగ జూస్తుంటే
పొంగు వారే గుండె
లొంగనంటోంది!

★ "చీకటోళ్లు", "బాకీ బతుకులు" ★

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం మద్రాసు శాఖ ఆధ్వర్యాన, నెల నెలా జరుగుతున్న గోష్ఠులతో 19వది డిసెంబరు 4వ తేదీన పొట్టి శ్రీరాములు స్మారక మందిరం (లజ్)లో జరిగింది.

శ్రీ హర్నాథ్‌గారి "చీకటోళ్ళు", శ్రీ కె. కె. మీనన్ గారి "బాకీ బతుకులు" నవలలపై గోష్ఠి వ్యాసాలు చదవబడినాయి.

ప్రథమంతో గోష్ఠి నిర్వాహకుల కోరికపై ఆ నవలా రచయితలు తమ రచనలను పరిచయం చేస్తూ వ్రాసిన లేఖను చదివేప.

"చీకటోళ్ళు" రచయిత శ్రీ డి. హరనాథరెడ్డి తమ రచన గురించి ఇల్లా వ్రాసేరు.

"నేను చూసిన నేల క్లాసు జీవితాలు అవి. ఆ జీవితాలు మీరూ, నేనూ అంతా చూస్తున్నవే. నేను ఆ జనం మధ్య వున్నాను. నేను చూసిన వాస్తవాన్ని ఒక రకమైన నల్లమందు సాహిత్యానికి అలవాటు పడిపోయిన పాఠకుల ముందు ఎలా పెట్టాలి ఎలా చదివించేలా చేయాలి అని ఆలోచించి, చదివించేటట్లుగా రాయడానికి ప్రయత్నించేను".

తరువాత "బాకీ బతుకులు" రచయిత శ్రీ కె.కె. మీనన్‌గారి లేఖ చదవబడింది.

"ఈ నవలకే కాదు. నేను రాసిన ప్రతి కథకూ ప్రేరణ ఒకటే. నేను అర్థం చేసుకొన్న శ్రమజీవుల బతుకు పోరాటం.........చాలా కాలంగా నేను మెసలిన వాతావరణం, చూసిన దృశ్యాలు, విన్న సంఘటనలు, ఎదుర్కొన్న సమస్యలు—పాత్రల ముసుగులో నా నవలతో ప్రత్యక్షమయాయి" అని వ్రాశారు.

వై. వి. ఎస్. ఎస్. ఎన్. మూర్తి

"ఇటీవల వెలువడిన రచనల్లో చెప్పుకోదగిన రచనగా భావించ వచ్చున"ని శ్రీ వై. వి. ఎస్. ఎస్. ఎన్. మూర్తి (పచ్చయప్పాస్ కాలేజీలో హిందీ లెక్చరరు) తమ "బాకీ బతుకులు—ఒక పరిశీలన" వ్యాసంతో గోష్ఠి ప్రారంభించేరు.

"మనమంతా బానిసలం.........కుడి యెడమల దగాదగా" అన్న శ్రీశ్రీ కవిత తమ రచనకు ఆలంబనమని రచయిత చెప్పేరు. ఈ నవల అంతటా పై పంక్తుల భావం ఎక్కడికక్కడ కనిపిస్తుంది. ఆ విధంగానే నవల మలచబడింది. అందుకేనేమో నవల్లో అంతగా సహజత్వం కనబడదు. స్థూలంగా ఇదో సినిమా కథలా కనిపిస్తుంది."

తరువాత "బాకీ బతుకులు" కథను వేర్వేరు పాత్రల స్వరూప స్వభావాలను వివరిస్తూ "అప్పల్రాజు పాత్రను రచయిత సహజంగా చిత్రించేరనడంలో సందేహం లేదు. ఇటువంటి అప్పల్రాజులు ఏ గ్రామం వెళ్ళినా కనబడతారు" అన్నారు.

చర్చావేదిక

"పాత్రల స్వభావం, రీతి రివాజులు, అలవాట్లు అన్నీ రచయితే చెప్తారు. కొన్ని కొన్ని సందర్భాల్లో వ్యాఖ్యానాల్లా చేస్తూవచ్చారు. దాని వలన నవల కుంటు పడింది. ఇందువలన ఎక్కడా పాత్రలు కనిపించవు. ఇటువంటివి పరిహరించగలుగుతే.

ఈ రచయిత నుంచి నవలలను తెలుగు భాషకు ఇవ్వగలరు" అని శ్రీ మూర్తి ముగించేరు.

ఎ. బి. సాయిప్రసాద్

తరువాత చదివిన శ్రీ ఎ. బి. సాయిప్రసాద్ (పచ్చయప్పాస్ లెక్చరర్) వ్యాసం కూడా ఒక్క "బాకీ బతుకుల"నే చర్చించింది.

వేరువేరు పాత్రలను, వానికి నవలలో ఇచ్చిన ప్రాముఖ్యతను, నవలలోని సామాజిక సమస్యల ప్రాధాన్యాన్నీ వివరించి శ్రీ ప్రసాద్ రచయిత ఉపదేశాత్మక ధోరణిలో కథ నడపడం వలన రచన దెబ్బతిన్నదన్నారు.

"గ్రామీణ వాతావరణాన్ని సృష్టించడం, వారి మనస్తత్వాలను చిత్రించడంలో రచయిత కృతకృత్యులయ్యారు. కాని, స్లోగన్లనూ, సూత్రాలనూ దృష్టితో పెట్టుకొని రచన సాగించినందువల్ల పుస్తకం వెట్టిచాకిరీని ఖండిస్తూ 20 సూత్రాల ప్రణాళికను ప్రచారం చేసే ప్రచార సాహిత్యంగా మారిపోయింది. రచయిత ఈ పరిధిని దాటాలి".

చామర్తి దుర్గాప్రసాద్

శ్రీ చామర్తి దుర్గాప్రసాద్ (ఐ ఐ టి లెక్చరర్) తమ వ్యాసంతో రెండు నవలలనూ సాకల్యంగా చర్చించేరు. మొదట "బాకీ బతుకులు" ఎత్తుకొని కథనూ, పాత్రలనూ వివరించేరు.

రచయిత సామర్థ్యంమీద గురి కలిగించే అంశాలు నవలలో చాలానే వున్నాయి. ఒకటి శైలి. మాండలిక శైలితో ఎత్తుబడిచేసి కొనసకంటా సాగించేరు. ఎక్కడా కృతకత్వం లేదు. వెంకటేశు పాత్ర మామూలు స్వామిభక్తి పరాయణుని కన్న భిన్నమయింది. అలాగే నక్కా పాత్ర ప్రవేశంలో చూపిన మెలకువ (మగవాళ్ళంతా దిగుతేగాని బస్సు దిగదు) ఆ పాత్ర చివర్లో చేసిన తెగింపుకి బలం ఇచ్చింది. "శ్రామిక జనం మాట మీద నిలబడతార"నే సుభాషితం చెప్పకుండా వాళ్ళు తమతోటి వాడిని ఎలా మోసగించగలరో (పుట 25) చూపడం మనిషిలోని స్వార్థాన్నీ, తప్పని సరిగా బతుకుకోసం చేస్తున్న ఆత్మవంచననీ ఎత్తి చూపడం అయిందే గాని శ్రామిక జనంపట్ల దురభిప్రాయం కలిగించదు. తాగుడికి బానిస అయి నరసింహులు కూతురు గౌనుకోసం పోగేసిన డబ్బును కోడి పందేల్లో పోగొట్టుకోడం వాస్తవ చిత్రణ.

నర్సు ఇంజక్షను రాయడం, దాని కోసం నక్కా శీలం అమ్ముకోవడం, కొంత తొందరగా కథని కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నంలో జరిగిన ప్రమాదమై ఉండాలి. ఇక్కడ కథ, చెప్పే పద్ధతి పేలవం అయిపోయినవి. ఆ మాటకొస్తే నరశింహుల్ని పట్నం పంపే ప్రయత్నం దగ్గరనుంచీ నవల్లో అంతకుముందు దాకా ఉన్న సంయమనం, వాస్తవ చిత్రణ దెబ్బతిన్నవనక తప్పదు. ఎన్నో విషయాలు చెప్పాలన్న ఆత్రం నవల్లో ప్లాజిబిలిటీకి భంగం కలిగించింది.

ప్రగతి శీల రచనలు చెయ్యడానికి ప్రగతి భావాలుండడం ముఖ్యమైన అవసరం. అయితే చదివేవారి హృదయం తాకగల విధంగా రాయగల నేర్పు, చదివినవార్ని ఆలోచనకు రేకెత్తించే శక్తి ఉన్నప్పుడే రచయిత నిజమైన ప్రగతిశీల రచనలు చెయ్యగలడు. అలా కానప్పుడు ప్రగతి శీల రచనలు ఫాషనబుల్‌గా తయారయ్యే ప్రమాదం ఎక్కువ. నవల దాదాపు ఆ ప్రమాదం ఎదుర్కొంటోంది. అయితే రచయిత అపక్వ దశనుండి ఎదగ్గల సూచనలు నవల్లో పుష్కలంగా ఉన్నాయి. ఎదగాలని ఆశిస్తాను.

ముందు సమీక్షించిన నవల్లో చివరి పేజీల్లో వర్ణించిన సిటీ, దళారి, గుడిసెలు అన్నీ నవల్లో మొదటి రెండు పేజీల్లో పూర్వరంగంగా ఇచ్చి అసలు కధ మొదలెట్టారు రచయిత. ఈ వర్ణన క్లుప్తంగా ఉండి కధా ప్రారంభానికి సరయిన ఊతనిచ్చింది. నవల్లో కథా వస్తువు బడుగు జనం ఆర్థిక సమస్యలకే కాక సంసారంలో ఉండే అత్తా కోడలు సమస్య, రంకు బొంకు, కొట్లాటలు మొదలైన వాటిక్కూడా ఎక్కువ పేజీలు కేటాయించారు రచయిత. ఈ భాగం సమర్థంగా సాగింది—శైలిగూడా పాత్రోచితంగా ఉంది. బడుగుజనం జీవితం అద్దంలా చూపెట్టారు రచయిత.

రచయిత వక్రంగా పదాల్ని ప్రయోగించడంతో సీరియస్‌గా చెప్పవలసిన ఘట్టాలు తేలికగా, ఒక్కొకప్పుడు ఫార్సుగా తయారయాయని నాలుగైదు వుదాహరణలతో వివరించేరు.

"పదాల ఎంపిక—ఆలోచించి మరీ వ్రాయడం చాలా అవసరం. వర్ణనలో అవసరమా కాదా అని ఆలోచించకుండా హాస్యం చొప్పించడం నవల్లో చెప్పదల్చుకున్న రసం—స్థాయి, వీటికి ద్రోహం చేస్తుంది.

ఏర్రమ్మ ఆశలు—పువ్వులా ఉన్న డబ్బులేని అమ్మాయి వాస్తవ జీవితంలో అందుకోలేని వాటికోసం కలలుకంటూ ఒక్కోసారి ఆ కలల్ని కానేపయినా నిజం చేసుకొందామనే తాపత్రయాన్ని చక్కగా సూచిస్తాయి. అలానే ఆదెమ్మ చెల్లెలికోసం, ఆకలి తీర్చడం కోసం వ్యభిచారానికి పూనుకోవడం. కానీ, ఈ వాస్తవాల, కఠోర సత్యాల షార్ప్‌నెస్ ఆవి చెప్పే తీరువల్ల పలచబడినై. ఆదెమ్మ ఇచ్చిన ఉపన్యాసం (నవల చివర) శిల్పానికి భంగం.

ఇదే తీరు అవాస్తవిక దృక్పధం కార్మికుల సమ్మెల పట్ల ప్రకటించబడింది. మొదటి సమ్మెలో బయటినుంచి వచ్చే లేబర్, సమ్మె చేస్తున్నవాళ్ళచే ఉపన్యాసం విని మారిపోయి తిరిగి వెళ్ళిపోతారు.

రెండవసారి కాంటీన్ రేట్లు పెంచారని కార్మికులు సమ్మె చేసి ఆ నాల్గు రోజులకే తమకు కాలేజీ లిచ్చేవార్ని మాన్పించడం-తమ క్రిందవున్న అభాగ్యుల పాలిట కనబరుస్తున్న వైఖరికి తార్కాణం. ఆదెమ్మ పతనానికి డబ్బుకలవాళ్ళ అహంకారమే కాదు కారణం, మనకన్నా అధోగతిలో ఉండి బేరమాడే శక్తిలేని వాళ్ళపట్ల మనం (కార్మికులు) చూపుతున్న దోపిడి కూడ కారణం. ఆవిషయాన్ని నిక్కచ్చిగా చెప్పలేని, సూటిగా చిత్రించలేని రచయితల మొహమాటం-లేదా సరిఅయిన అవగాహన లేక

పోవడం-ప్రగతి శీలమయిన రచనలకి అస్కారం కలిగించదు.

చీకట్లో మేలిగేవాళ్ళ జీవితాలు నలుగురికి చక్కగా కనపడాలి కనక లైటు వెయ్యవలసిందే. ఆ లైట్లు వెయ్యడం మూలాన ప్రేక్షకులకి చీకటి అసలుతత్వం మరుగున పడకూడదు.

ఇంతగా ఎందుకు చెప్పవలిసి వస్తోందంటే ఇద్దరు రచయితలూ బాకీ బతుకులు గడుపే వారిపట్ల, చీకట్లో శిథిలమయ్యే వారిపట్ల సానుభూతి చూపుతున్నారు, ఆ సానుభూతి వలన వచ్చే రచనలు చదివేవాళ్ళల్లో కూడా ఆ సానుభూతిని రేకెత్తించాలి. అంతే గాని కాలక్షేపానికి ఉపయోగపడే నవలగా తయారు కారాదు. ఎందుకంటే-

బంగార్రాజు చేతిలో తనంత తాను డబ్బుతెమ్మని- మానపతి అదెమ్మ-అతనే నడిపే లాడ్జిలో చేరడం--బస్సులోంచి అందరూ దిగిన తర్వాత ఎవర్నీ తాకకుండా, దిగే స్త్రీ తన సంతానం ఆకలికోసం, మందుకోసం దిగజారడం-రెండు నవలల్లో సమానం, ఆ ఘట్టాలు గట్టిగా పాఠకుడ్ని కదపకపోవటం కూడా.

మహీధర రామమోహనరావు

ఇటీవల వచ్చిన మంచి నవలలో శ్రీ హరనాథ్‌గారి "చీకటోళ్ళు" ఒకటి. విశాఖపట్టణంలోని ఒక మురికి పేట జీవితం ఇందులోని ఇతివృత్తం. పేట మురికి పేట కావచ్చు, అందులో అంతా మురికివాళ్ళే వుండరు. అనేక రకాల జీవితాలు, అనేక తరహాల మనుష్యులతో ఆ మురికి పేట జీవితం కలనేత చీరలాంటిది. ఆ మురికి పేట మురికి పేటగానే పుట్టలేదు. అక్కడ మురికి వుండేది. గ్రామాలలో ఆధారాలుపోయి బతుకు తెరువు వెతుక్కుంటూ పట్టణాలకు చేరిన అప్పన్న కుటుంబం లాంటివి అన్నీ అక్కడచేరి పేటను లేపేయి. బతుకు చెడి మురికి పేట చేరి అడుక్కి ఇంకా అడుక్కి పోతున్నా ఈ కుటుంబాలు తమ పూర్వ జీవితపు అలవాట్లను, ఆచారాలను, అలోచనలను, అభిమానాలను నిలుపుకొనేందుకే ప్రయత్నించేయి.

ఆలాగని మురికి పేట బతుకులు, పాత అలవాట్లూ, ఆలోచనలతోనే మగ్గిపోలేదు. పేటలోని అధిక సంఖ్యాకులకు ఫ్యాక్టరీ పనులూ, ఏకత్ర జీవితమూ అంత క్రితం లేని ఆశ యైక్యతను సృష్టించింది ఒక్కటిగా నిలబడి తమకు జరుగుతున్న అన్యాయాల్ని ఎదుర్కొనే తెగువ వచ్చింది.

నవలలో కాజువల్ లేబర్‌ను పెర్మనెంటు చేయాలనే కోరికతో ప్రారంభమైన సమ్మె, కాంటీన్ ధరలపై ప్రారంభమైన సమ్మె విజయం పొందడంవంటి ఘటనలు ప్రవేశపెట్టినా రచయిత వానికి ప్రాస్తానికి ప్రాముఖ్యం మాత్రమే యివ్వడం ఈ నవలలో చాలా సముచితంగా వుంది. విప్లవాన్నీ, విప్లవ భావాల్నీ బాహ్య పరిస్థితులకే గాక, వాని ప్రేరేపణతో పెరిగిన ప్రజల మానసిక ప్రవృత్తులకు కూడా సంబంధం వున్నదిగా చిత్రించడానికి ప్రయత్నించడం చాలా సముచితంగా వుంది.

అయితే నవలా రచనలో హరనాథ్ గారు మధ్యతరగతి మనస్తత్వపు బురదనుంచి బయట పడలేక పోయేరు. ఆదెమ్మ తన్ను పెళ్ళి చేసుకుంటూ నన్న

సూరాజును నిరాకరించడంలో కనబరచిన "త్యాగం" ఆ విధమైన మనఃప్రవృత్తే.

ఆలాగే మురికి పేట భూమిని బంగార్రాజు నుంచి కొనేసి, సోములమ్మ దానిని గుడిసెల వాళ్ళకి రాసి యివ్వడం, వసతి స్థలాల తగువు పరిష్కారం కావడం కూడా అటువంటి మధ్యతరగతి మన స్తత్వాలు వెతుక్కునే పరిష్కార మార్గాలలో ఒకటి.

తాత్విక దృష్ట్యా ఇవి నవలలోని ప్రధాన లోపాలు. ఇవిగాక నవ రచయితలు కనబరచే కొన్ని లోపాలు పొడూగునా కనబడుతున్నాయి. కొందరిలా హర్నాధ్‌గారు ధనికులంతా దుర్మార్గులు, పేదలంతా సన్మార్తులూ అనే ధోరణిని చేపట్టలేదు. కాని పాత్రల రూపం, మాటలు, గుణాలు వర్ణనలతో వాని యోగ్యత, నీచత్వం కాదు మనకు కనిపించేది. ఆ పాత్రలమీద రచయితకుగల రాగ ద్వేషాలు కనిపిస్తున్నాయి.

మొత్తంమీద "చీకటోళ్ళు" మంచి నవలల్లో ఒకటిగా పేర్కొనవచ్చును.

"బాకీ బతుకులు" తూర్పు, పడమర గోదావరి జిల్లాలలో ప్రత్యేకించి రాజోలు ఖండం, నరసాపురం తాలూకాల వ్యవసాయ కూలీల దయనీయ జీవితాన్ని తెలుపుతున్న నవల. నవలను చదివే సరికి ఈ జీవితాలతో ప్రత్యక్ష పరిచయం గలిగి వ్రాశారని అర్థం అవుతుంది. కాని దురదృష్టవశాత్తూ రచయితకు తన అనుభవాన్ని సొంతం నడపగల శక్తి లేకపోయిందని 50 పేజీలు వెళ్ళేసరికి తేలిపోతుంది.

ఈనాడు మన తెలుగు నవలలలో కథలో మలుపు తేవడానికో, పీడకుల దౌర్జన్యాల పరమావధి చూపడానికో, చదువరులలో పాత్రలమీద సానుభూతి కలిగించడానికో సెక్సు దౌర్జన్యాల నాసరాచేసుకోడం పరిపాటి అవుతూంది. డబ్బున్న వాడికో, సమాజంలో దురధికారం చెలాయించేవాడికో ప్రధానంగా కనిపించిన ఆడదానినల్లా చెరచడమే దినచర్యా, జీవిత ధ్యేయమూ అయినట్లు వర్ణిస్తున్నారు.

ఇందులో బలరామ రాజు పాత్ర చాలా నిరర్ధకం, అపాయకరము అంటే తప్పు కాదు. మాటల్నిపట్టి ఆయన కమ్యూనిస్టు కాకపోయినా ఆ వుద్యమాలతో పరిచయం వున్నవాడనిపిస్తుంది. అప్పల్రాజు చేతినుంచి పంచాయతీని "నిర్దాక్షిణ్యంగా" లాగేసుకున్నాడు. అంటె ప్రజల్లో పలుకుబడీ, బలం వుంది.

చదువున్నవాడు, వకీలు, రైతులు అంతా ఆయన సలహాలకి రావడం చూస్తే ఆయనకున్న గౌరవం అర్థం అవుతుంది. వీటికి తోడు కుటుంబ ప్రతిష్ఠ వుంది. ఇన్నీ వుండిన అసమర్ధ పాత్రను ఎందుకు సృష్టించా రనిపిస్తుంది. నిస్పృహతో "తల పగలేసి పారిపొండోయ్" అని ఆయన సలహా యిచ్చినా అర్థం చేసుకోగలం గాని, చేతగానితనం చాలా భయంకరం.

మొత్తంమీద చక్కని ఇతివృత్తంతో, బిగువుగా ప్రారంభం అయిన నవల చివరకు వెళ్ళేసరికి లక్ష్యం కోల్పోయి అవసరంలేని వ్యభిచార గాధలు, నిస్సహాయతలు, బాధల రొడ్డకొట్టుడులో పడిపోయింది.

ఈ యువ రచయితలిద్దరికీ సామాజిక దృష్టి వుంది. సమాజంలో జరుగుతున్న అన్యాయాల స్వభావం తెలుసు. పీడితులు, బాధితులయెడ సానుభూతి వుంది.

తమ భావాలకు మూర్తిని కల్పించగల కల్పనా బలం వుంది. కల్పనకు శబ్ద వాక్య రూపం యివ్వగల సామర్థ్యం వుంది.

అయితే ఇద్దరూ నవ రచయితలు. సౌజన్యంతో, సహృదయంతో, నిర్మాణాత్మకంగా వారి ఈ రచనల మీద చర్చ జరిపితే ఆ రచయితలకు సాయపడుతుందనీ, తెలుగు సాహిత్యం సంపన్నం కావడానికి తోడ్పడుతుందనీ దీనిమీదగోష్ఠి ఏర్పాటు చేశాం. ఈ యువ రచతలు ఆ స్పిరిట్‌తోనే ఈ విమర్శను స్వీకరిస్తారని ఆశ.

బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు

శ్రీ బి. సూర్యారావు గారు తమ వ్యాసంలో చీకటోళ్ళు గురించి చెప్తూ, పట్టణ సివార్లలో నివసించే పేదప్రజల జీవితాన్ని చిత్రించాలనే ప్రయత్నం జరిగిందీ నవలలో. పేదరికం మానవుల్ని వక్రమార్గాలను పట్టిస్తుందని, బతుకుతెరువు కోసం ఎంత నీచానికైనా వడిగట్టవలసి వస్తుందనీ చెప్పడం సహజంగా వుంది. ఇందులో పాత్రలు సహజందానే ప్రవర్తిస్తాయి. పేదవాళ్ళు సుఖాలకోసం, ముఖ్యంగా మధ్యతరగతి వాళ్ళను అనుకరించాలనే ఆరాటం, ధనికుల విలాసాలవైపు ఆకర్షించబడడం సహజమే. ఈ ఆరాటంలో వాళ్ళ బతుకులు నాశనమవుతాయి. ఇంకొక వైపు మన సాంఘిక సాంప్రదాయాలు, నీతి నియమాలు పేదవాళ్ళను పట్టి పీడిస్తూనే వున్నాయి. ఈ రెండు నవలల్లోనూ, యింకా మరికొన్ని యిలాంటి నవలల్లో దిక్కులేని నిరుపేదల బతుకులు చిత్రించేటప్పుడు కొన్ని సాధారణ హంశాలు మనకు కనిపిస్తాయి. పేదస్త్రీ సాధారణంగా అందంగా వుంటుంది. పేదరికంవల్ల వ్యభిచారిణిగా మారుతుంది.

భూస్వాములు స్త్రీలను చెరబట్టడం వాళ్ళ దౌర్జన్యాలలో ఒక భాగం. కాని భూస్వాములే కాదు. దుర్మార్గు లెవరైనా ఆపని చెయ్యవచ్చును. ఇది వర్గలక్షణంకాదు.

ఈ రెండెంటిలో ప్రధాన స్త్రీ పాత్రలమధ్య వ్యత్యాసం వుంది. మొదటి నవలలో ఆదెమ్మ పరిస్థితులతో పోరాడాలనే ప్రయత్నిస్తుంది. రెండవ నవలలో స్త్రీ పరిస్థితులకు బానిసైపోతుంది. మొత్తంమీద రెండు నవలలు మంచి యితివృత్తాన్ని స్వీకరించి సామాజిక స్పృహతో సమకాలిన జీవితాన్ని చిత్రిస్తున్నాయి.

తరువాత శ్రీకాంత్ "చీకటోళ్ళు"లో చితికిపోయిన పాత్రలలో మధ్యతరగతి మనస్తత్వాల ప్రభావమూ, "బాకీ బతుకులు" పాత్రలలో రైతు మనస్తత్వాలూ ఎల్లా వ్యక్తమవుతున్నాయో, జీవిత పోరాటంతో అవి వున్నతస్థాయికి ఎదుగుతున్న తీరును సౌదాహరణంగా వివరించేరు.

శ్రీ సెట్టి ఈశ్వరరావుగారు "రాస్తున్న వాళ్ళూ, చదువున్న వాళ్ళూ, మధ్య తరగతుల వాళ్ళు ఈ నవలలలో కొన్ని లోపా లున్నప్పటికీ బీద బిక్కి బతుకులు చిత్రిందడానికి ప్రయత్నించేరు ఇది సాహిత్యంలో ఓ పరిణామ దశ. నల్లమందు సాహిత్యం నుంచి సామాజిక సమస్యల వేపు దృష్టి మళ్ళుతూంది. రచయితలు మధ్య తరగతి వాళ్ళు, వాళ్ళ రచనల పట్ల నిర్దాక్షిణ్య విమర్శ న్యాయం కాదు. వాళ్ళ కృషిని మెచ్చుకోవాలి" అన్నారు.

లేఖలు

డిసెంబరు సంచిక

తొలిసారిగా "అభ్యుదయ" డిసెంబర్ 77, సంచికను సోదరులు, వర్ధమాన అభ్యుదయ కవి, శతావధాని శ్రీ నరాల రామారెడ్డి గారి ద్వారా చూసి, చదివే అవకాశం లభించినందుకు - చాలా సంతోషిస్తున్నాను.

వరద బాధితుల సహాయార్థం "అభ్యుదయ" వెయ్యి రూపాయలు అందించటం ప్రశంసనీయం,

"నిజాం కొలువులో విప్లవకవి వింత అనుభవాలు" అనే "విశ్వమిత్ర"గారి వ్యాసం, నోబెల్ బహుమతి పొందిన "సౌందర్యం—సంతాపం" నవలపై "ఫణి"గారి సమీక్షా వ్యాసం విజ్ఞాన దాయకంగా వున్నాయి. కవితలలో, శశికాంత్ శాతకర్ణిగారి "చీకటి నిద్ర నుండి మేల్కొన్నాను", ప్రసన్నకుమార్ గారి "భ్రమ", శ్రీ కొల్లూరి సూర్యనారాయణ మూర్తి గారి "ఎవరు నీవు" "మున్ముందుకు" అనే కవితలు మాకెంతో నచ్చాయి.

శ్రీ మహీధర రామశాస్త్రి గారి "నిజం" కథ చిన్నదైనా పోలీసు శాఖలోని అవినీతికి దర్పణం వంటిది. శ్రీ స్వామిగారి "హెచ్చరిక" (కవిత) మరీ బాగుంది.

అశ్లీలకరమైన సెక్స్ పత్రికలతో, అపరాధ పరిశోధక నవలలతో కుతి తీర్చుకుంటున్న నేటి యువతరంలో ఉత్తరాభిరుచుల్ని ప్రోత్సహిస్తూ, సంఘంలో కుళ్ళుని కడిగే, సమాజంలోని అసమానతల్ని తొలగించే, చక్కటి రచనలు ప్రచురిస్తూ ... "అభ్యుదయ" అభ్యుదయ భావనా మార్గంలో పయనిస్తూ తెలుగు పత్రికా రంగంలో విశిష్టత సంతరించుకో గలదని ఆకాంక్షిస్తున్నాను.

యస్. ఆర్. ప్రతాప రెడ్డి
చల్లబసాయ పల్లె

"అభ్యుదయ" నిధి

తుఫాను బాధితుల సహాయ నిధికి డబ్బు వసూలు మొదలుపెట్టాను. మొదటి దినమే రూ॥ 1000 వసూలు అయింది. జనవరి 1 న తారీఖున డబ్బు డ్రాఫ్టు పంపుతాను, అది బహరెన్‌లోని భారత రాయబారి ద్వార పంపవలసి ఉంటుంది. రాయబారి కార్యాలయాన్ని సంప్రదించిన పిదప మీ అడ్రసుకు వారు అందజేస్తారు. మీరు దానిని ముఖ్యమంత్రి నిధికో, లేక ఆ సహాయ కార్యక్రమంలో డైరెక్టుగా సహాయాన్నందిస్తూన్న మరో సంస్థకో అందజేయగలరు.

భాగవతుల శ్రీమన్నారాయణ మూర్తి
బహరేన్(అరేబియన్ గల్ఫ్)

జనవరి 1 (ఆదివారం) గోష్ఠి

"ఆంధ్రపత్రిక", "ఆంధ్రజ్యోతి"
దీపావళి పోటీ కథల చర్చ
స్థలం- పొట్టిశ్రీరాములు స్మారకమందిరం
సాయంత్రం 6 గంటలకు

Edited and Published by T. Venkataramaiah, at 15 Arulammal Street. Madras-600 017 and Printed at Sri Venkateswara Printers, Madras-600 021.